కరీంనగర్
సూర్య
www.suryaa.com
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
శుక్రవారం 15 మార్చి 2024
13పేజీలు

## ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

సూర్య రాజన్న సిరిసిల్ల



(వివరాలు 2లో)

# భూ అక్రమాలు @ కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం






- ఇష్ట రాజ్యంగా భూముల బదిలీలు
- ధరణి చాటున అక్రమాలు
- ప్రభుత్వ భూమికీ.. లేని రక్షణ
- అసలు భూ హక్కుదారులకు అవస్థలు
- కార్యాలయం చుట్టూ పళ్ల తరబడి ప్రదక్షణలు
- సమస్య పరిష్కారంకాక కోర్టుల ఆశ్రయం
- నకిలీ పత్రాల కేసులో మాజీ తహశీల్దార్ అరెస్ట్
- అధికారుల అండతో భూకబ్జాలు చేసిన నాయకులు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**
**(బోనాల వెంకటేశ్)**

కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం ఈ పేరు ఈ మధ్య కాలంలో కరీంనగర్ జిల్లాలో ఎక్కువగా వినిపిస్తున్న పదం.. నకిలీ పత్రాలు సృష్టించడం.. వాటితో ధరణిలో పేరు మార్చుకోవడం తద్వారా భూములపై కబ్జాచేసి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్న సంఘటనలు కొద్ది కాలంగా కొత్తపల్లి తాసిల్దార్ కార్యాలయం పరిధిలోని భూములకు సంబంధించి ఉండడం గమనించాల్సిన (మిగతా 2లో)



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం



**రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

- పార్టీలకతీతంగా పనిచేస్తా
- తాగు, సాగునీటి ఇబ్బందులు తీరుస్తా..



**సూర్య సైదాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నానని రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గ్రామాల్లో తాగునీటికి ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇందుకు నిధులు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని పేర్కొన్నారు. గురువారం సైదాపూర్ మండలం వెన్కపల్లి గ్రామంలో మండలానికి సంబంధించి దాదాపు కోటి రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి

(మిగతా 2లో)

### ఆరు గ్యారంటీలకే దిక్కులేదు...

## మహిళ పేరిట రూ.లక్ష ఇస్తాననడం హాస్యాస్పదం

- హామీలకు ఆశపడి ఓటేస్తే మోసపోతారు
- గ్రామాలకిచ్చే నిధులన్నీ మోదీ ప్రభుత్వానివే

**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్**

- బండి సంజయ్ గెలిస్తే మోదీ కేబినెట్ లో మంత్రి కావడం తథ్యం

**మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు**



**సూర్య బోయినిపల్లి**

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోని ప్రతి మహిళ పేరిట లక్ష రూపాయల చొప్పున బ్యాంకులో జమ చేస్తానని, ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీలివ్వడం పెద్ద జోక్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రజాహిత యాత్రలో భాగంగా చొప్పదండి నియోజకవర్గంలోని (మిగతా 2లో)

# ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి - వ్యయ వివరాలను పకడ్బందిగా నమోదు చేయాలి**

**-అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లఘునల పై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ (ఏ.ఈ.ఓ)లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అనురాగ్ జయంతి మాట్లాడుతూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని సెక్షన్ 28 ప్రకారం మనమంతా భారత ఎన్నికల కమిషన్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, మనం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, మన పారదర్శకత ప్రతి అంశంలో స్పష్టంగా కనిపించాలని , ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు.పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణిను గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, సి-విజల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుది ట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్ బృందాలు నగదు ,ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించ వద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకు ండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. వీడియో సర్వేలెన్సు బృందాలు ,వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు ఎన్నికల నేపథ్యంలో జరిగే ప్రతి రాజకీయ సభలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, కుర్చీలు, స్టేజి, సౌండ్ ఏర్పాట్లు , భోజనం తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని అన్నారు.అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతూలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చు పై నివేదిక తయారు చేసే విధానం పై పి.పి.టి. ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీఓ రమేష్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి , అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

*(మొదటి పేజి తరువాయి)*

శంకుస్థాపన చేశారు. అమ్మన గుర్తి గ్రామంలో రెండు కోట్ల రూపాయలతో చేపట్టనున్న 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు వెన్కపల్లిలో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కోసం ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం దాదాపు మూడున్నర కోట్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూస్తానని తెలిపారు. విద్యకు సీఎం రేవంత్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, పాఠశాలల సమాగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు, టాయిలెట్ల నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు వైద్య పరంగా సేవలందించేందుకు 24 గంటల పాటు అందు బాటులో ఉంటామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయిం చినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ప్రధానంగా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం నిరంతరం శ్రమిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పాఠశాలల్లో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిం చేం దుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామని చెప్పారు. ఆయా గ్రామాల్లో మంత్రికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మన గుర్తి గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన కాయిత యాదగిరి రెడ్డిని మంత్రి ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేంద్ర, ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ గంగాధర్, ఎంపీటీసీలు జంపాల సంతోష్, లంక దాసరి అరుణ, ఓదెలు, చాంద్ పాషా, మల్లేశం, ఎంపీడీవో యాదగిరి, తహసిల్దార్ మంజుల, నాయకులు సుధాకర్, గుండారపు శ్రీనివాస్, కిష్టయ్య భాస్కర్ రెడ్డి, రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలకే దిక్కు లేదు... మహిళ పేరిట రూ.లక్ష ఇస్తాననడం హాస్యాస్పదం

*(మొదటి పేజి తరువాయి)*

బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని అర్థమై అడ్డగోలుగా హామీలన్నీ గుప్పిస్తున్నారని విమర్శించారు. "ఉద్యోగాల సంగతి తరువాత... మీకు దమ్ముంటే కాంగ్రెస్ పార్టీలోని పదవుల్లో 50 శాతం మహిళలకు కేటాయించాలి. మీకు దమ్ముంటే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో సగం మంది మహిళలకు టిక్కెట్లు ఇవ్వు... ఇది మీ చేతుల్లో ఉన్నదే కదా... వాటిని అమలు చేసిన తరువాత ఇతర హామీల గురించి మాట్లాడండి" అంటూ చురకలంటించారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలకే దిక్కు లేదు.. మహాలక్ష్మీ పథకం కింద ఒక్కో మహిల అకౌంట్లో నెలనెలా రూ.2,500లు జమ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారంటూ మండిపడ్డారు.. హామీలకు మోసపోవద్దని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, 6 గ్యారంటీలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా వెంటపడతామని స్పష్టం చశారు.ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటివరకు హామీల అమలు కాలేదు. రెండు రోజులు అయితే ఎన్నికల కోడ్ వస్తుంది.. మళ్ళీ ఎగ్గొట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందనీ అన్నారు. 100 రోజులు పూర్తవగానే కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోతే.. బరా బర్ మీ కోసం కొట్లాడెందుకు నేను సిద్ధం దయచేసి అందరూ కలిసి పువ్వు గుర్తుకు ఓటేసి మోదీనీ గెలిపించండనీ కోరారు.

**బండి సంజయ్ గెలిస్తే మోదీ కేబినెట్ లో మంత్రి కావడం తథ్యం**

**మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే నరేంద్రమోదీ కేబినెట్ లో మంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎన్.రఘునందన్ రావు అన్నారు. రాష్ట్రంలో ఎదురే లేదని విర్రవీగుతున్న బీఆర్ఎస్ ను కూడా ఓడించవచ్చని నిరూపించి వచ్చిన తొలి ఎన్నిక దుబ్బాక అని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో తాను అభ్యర్థిగా నిలబడితే పోరాడి గెలిపించిన నాయకుడు బండి సంజయ్ అని పేర్కొన్నారు. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో... కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావడం అంతే నిజమని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా బండి సంజయ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ దేశానికి దిక్సూచి మోదీ అని కొనియాడారు. కరోనా సమయంలో ఉచితంగా వ్యాక్సిన్ అందించి దేశ ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు.

# భూ అక్రమాలు @ కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం

*(మొదటి పేజి తరువాయి)*

విషయం. కరీంనగర్ పోలిస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల కాలంలో అరెస్టులకు గురవుతున్న చాలా మంది కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం సంబంధించిన భూముల విషయంలో అరెస్ట్ కావడం ఆలోచించాల్సిన విషయం. ఇందులో భాగంగా ఇటీవల ఇదే కార్యాలయం చెందిన మాజీ తహసిల్దార్ అరెస్టు కాబడినాడు. తాసిల్దార్ కార్యాలయం పరిధిలోని చింతకుంట, కొత్తపల్లి, కమాన్పూర్, బావుపేట్ ,మల్కాపూర్ ,కాజిపూర్, ఎలగందుల గ్రామాల్లో భూముల రేట్లు అమాంతం పెరగడంతో భూకబ్జాదారులు బరితెగించి ప్రభుత్వ భూములు, ప్రైవేట్ వ్యక్తుల భూములను నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసుకోవడం జరుగుతుంది. కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది, అధికారుల అండదండలతో ప్రజల భూములను భూ కబ్జాదారులు, నాయకులు సరైన పత్రాలు లేకున్నా కూడా ఇష్టారిత్య ధరణిలో నమోదు చేయడం జరిగింది. ఇలా అసలు భూ యజమానులు తమ భూములు వారి పాస్ బుక్‌లో రికార్డు కాకపోవడంతో కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి ప్రదక్షిణ చేస్తున్నారు. కార్యాలయ సిబ్బంది వారి ప్రయోజనాల కోసం భూ యజమానులను రికార్డులను ఇష్టారీత్యా నమోదు చేయడంవల్ల సామాన్యులు ఇబ్బందుల గురవుతున్నారు. కార్యాలయంలో జరిగిన తప్పులకు వాటి పరిష్కారం కూడా ఇక్కడ జరగక పోవడం.. అధికారులు కూడా సరైన పరిష్కారం చూపకపోవడం వలన బాధితులు కోర్టులను ఆశ్రయించడం జరుగుతుంది. దీంతో సొంత భూమి కలిగి ఉండి కూడా సమస్యలు రావడంతో ప్రజలు నానా అవస్థలు గురవుతున్నారు. కేవలం సిబ్బంది ,అధికారుల నిర్లక్ష్యం వలన... వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం ఇష్టారీత్యా నమోదు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు విచారణ జరిపి భూముల నమోదు, క్రమబద్ధీకరణ సవ్యంగా జరిగేలా చూసి తగిన న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సీఎం రేవంత్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



**సూర్య, రాయికల్**

తెలంగాణ రాష్ట్రంలో వివిధ కులాల అభివృద్ధి కోసం 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం పట్ల మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన కుల సంఘాల సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, పట్టభద్రుడు ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.రెడ్డి, యాదవ,పద్మశాలి,మేరు, ఆర్యవైశ్య, ముదిరాజ్ తదితర సంఘాల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మాజీ మంత్రి జీవన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి,హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు,త్వరితగతిన రూపకల్పన చెంది,ప్రజలకు సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ఆయా కుల సంఘాల మండల,గ్రామ నాయకులు,ప్రజా ప్రతినిధు లు తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కొరడా

**సూర్య ఓదెల**



వారు గురువులు క్రమశిక్షణ, సమయపాలన, సంస్కారం తో పాటుగా విద్యాబుద్ధులు నేర్పుతూ విద్యార్థుల జీవితాలను చక్కదిద్దాల్సిన బాధ్యత కలిగిన వారు, అలాంటి ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సమయానికి పాఠశాల కు రాకపోవడంతో జిల్లా విద్యా అధికారి ఆగ్రహానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే ఓదెల మండలంలోని పలు పాఠశాలల్లో జిల్లా విద్యాధికారి మాధవి ఆకస్మిక తనిఖీ చేశారు. సిపిఎస్, జెడ్ పి హెచ్ ఎస్ పోత్కపల్లి, జడ్.పి.హెచ్.ఎస్ ఓదెల, ఎంపీపీఎస్ కొలనూర్ స్టేషన్, ఓదెల , తారకరామా కాలనీ ఎంపీ యుపి ఎస్ గోపరపల్లి పాఠశాలలను సందర్శించి ఆలస్యంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ లో ఆబ్సెంట్ మార్క్ వేసి ఒకరోజు జీతం నిలిపేయాలని ఎంఈఓ రాజయ్య ను ఆదేశించారు.

## అపోలో రీచ్ హాస్పిటల్ లో ఘనంగా

# అంతర్జాతీయ మూత్రపిండాల దినోత్సవం

**సూర్య,కరీంనగర్ రూరల్**

కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్ లో గురువారం అంతర్జాతీయ మూత్రపిండాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిడ్నీ వ్యాధి నిపుణులైన డాక్టర్ కొత్త చాందిని, డాక్టర్ ఎస్ సురేష్ గౌడ్



హాజరయ్యారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి శరీరంలో మూత్రపిండాల యొక్క సరైన పనితీరు ఎంత ప్రాముఖ్యమని ప్రత్యక్షంగా, పరోక్షంగా మూత్రపిండాలు మనిషి లోపల వ్యర్థాలను విసర్జించడమే కాకుండా ఎన్నో జీవక్రియలకు తోడ్పడుతుందని మనిషి యొక్క సంపూర్ణ ఆరోగ్యానికి గుండె, మెదడు, ఊపిరితిత్తులు ఎలా ప్రధానమైన భూమిక పోషిస్తాయో అంతే ఎక్కువ ప్రాధాన్యం మూత్రపిండాలకు కూడా కలదని తెలిపారు,అన్ని వర్గాల యొక్క ప్రజానీకానికి అందుబాటు ధరలలో అనగా రూ.999 తో వివిధ రకాల



సమర్థవంతమైన రక్త, స్కానింగ్, మూత్ర పరీక్షలు అందిస్తూ వారి వారి కిడ్నీ యొక్క ఆరోగ్యాన్ని తెలుసుకొనుటకు అందుబాటు ధరలలోకి తీసుకురావడం జరిగిందని. ఇట్టి హెల్త్ ప్యాకేజీ మార్చి 14 2024 నుండి జూలై 31 వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఎస్టీలకు మూడు కార్పొరేషన్ లు ఏర్పాటు చేసినందుకు స్థానిక ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయటం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ నాయక్ మాట్లాడుతూ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా ఎస్టీ లకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం సంతోషదయాకమని అన్నారు లంబాడిలాకు సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఎరుకలకు ఏకలవ్య కార్పొరేషన్ ఆదివాసీలకు కొమరం భీమ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయటం జరిగింది కార్పొరేషన్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ చేశారు. అదేవిదంగా సేవాలాల్ జయంతికి కూడా ఐచ్చిక సెలువు ఇవ్వటం జరిగింది రాబోయే రోజుల్లో 12శాతం రిజర్వేషన్ కూడా ఇస్తారాణి ఆశభావం వ్యక్తం చేశారు. ఎస్టీ లకు మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ అండగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, వెన్న రాజమల్లయ్య,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కంకణాల అనిల్ కుమార్,లావుడియా రంగా నాయక్,కుతాడి శ్రీనివాస్,దన్న సింగ్, గుండా మల్లేష్,వినోద్ నాయక్, సుధాకర్ నాయక్, మాలోతు మహాలక్ష్మి, కుంభాల రాజ్ కుమార్, హస్త పురం తిరుమల, మోతిలాల్ నాయక్, బాలునాయక్, కల్వల పేర్లు రాంచంద్రం,,నాయక్, షబానా, రజిత రెడ్డి, స్వప్న, శివప్రసాద్, జీడీ రమేష్, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే రసమయి కి చీర,సారే ప్రధానం చేసి నిరసన తెలిపిన బీజేపీ నేతలు

**- రసమయి చిల్లర రాజకీయాలు మానుకో - బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు : రాపాక ప్రవీణ్**

**సూర్య - మానకొండూర్ :**

కరీంనగర్ బీఆర్ఎస్ కథనబేరి సభలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం బీజేపీ మానకొండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కు చీరే, సారేను ప్రధానం చేసి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ రసమయికి ఒళ్ళు కొవ్వెక్కి మాట్లాడుతున్నారని బండి సంజయ్ ని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే హొదాలో ఉండి చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని



పేర్కొన్నారు. ఇద్దరు భార్యలు ఉన్న రసమయి రామభక్తుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. ఇకపై చిల్లర రాజకీయాలు చేస్తే మానకొండూరులో గాడిదపై రోడ్డు మీద ఊరేగిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ ఏడు పార్లమెంటు నియోజకవర్గాలలో బోయినిపల్లి వినోద్ కుమార్, రసమయి బాలకిషన్ మోకాళ్ళపై ప్రదక్షిణలు చేసి ఓట్లు అడిగినా బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు.కేంద్రంలో మోడీ కరీంనగర్ లో బండి సంజయ్ గెలుపు ఖాయమని రాపాక ప్రవీణ్ జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు కత్తి ప్రభాకర్ గౌడ్, కంది రాజీరెడ్డి,మండల ఉపాధ్యక్షులు వ్యాట లక్ష్మారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మార్కొండ రమేష్ పటేల్, బీజేవైఎం మండలాధ్యక్షులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, ఉపాధ్యక్షులు కొంద్ర వరప్రసాద్, కాల్వ సాయికుమార్, నాయకులు నందగిరి బలరాం, మచ్చ రవీందర్, కోల శ్రీనివాస్, జంగిలి రాకేష్, ఆరెపల్లి సునంద్, పాకాల దేవేందర్ రెడ్డి, బుర్ర బన్ను, కోటి, మహేష్ తదితరులు ఉన్నారు.

## మాల మాదిగ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు

**- జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్**

**- దళిత కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేవెళ్ల దళిత డిక్లరేషన్ లోఇచ్చిన హామీని నెరవేరుస్తూ మాల మాదిగలకు ప్రత్యేకమైన కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం పట్ల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కోర్టు చౌరస్తాలోని జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేసిన తదుపరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం దళిత బంధు పేర్లతో దళితులను మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీ మాల, మాదిగల కు రెండు ప్రత్యేకమైన కార్పొరేషన్లను ఏర్పాటు చేసి దళితుల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకుందని తెలిపారు. కార్పొరేషన్ లో ఏర్పాటు ద్వారా దళితుల ఆర్థిక స్వావలంబనకు ఎంతో కృషి చేస్తుందని తద్వారా మాలా మాదిగలు ఆర్థికంగా స్థిరపడడానికి దోహదం చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ నాయక్, జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ ,ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, దండి రవీందర్, జీడి రమేష్ ,మీసాల సాయిలు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, హస్త పురం రమేష్, దన్నూ సింగ్, కలువల రామచందర్ ,శివప్రసాద్ , కడమండ్ల మనోజ్, భారి, అస్తపురం తిరుపతి మహేష్ ,కిరణ్ ,సంపత్ , రాజ్ కుమార్, గాజుల రాజకోటి, వెన్నెం రజిత రెడ్డి, స్వప్న, షబానా, కవిత, హస్త పురం తిరుమల, మాలోతు మహాలక్ష్మి, హసీనా, నాగుల సతీష్, పెద్దెల్లి ఆంజనేయులు, ఎస్డి అజ్మత్, సోహెల్ ,శారద, జక్కని బాబు, హనీఫ్ , బషీర్ , నాగుల శివకుమార్ ,తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ హెల్త్ మిషన్ క్రింద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ క్రింద కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ పద్ధతి పైన (8) రకాల పోస్టులలో వైద్యాధికారి (4), స్టాఫ్ నర్స్ (21), %మీనా% (13), జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ (01), ANM (01), ఫార్మసిస్ట్ (03), DEO (01), ఆప్తోమెట్రిస్ట్ (01) పోస్టులను భర్తీ చేయుట కొరకు ఇదివరకే తేది: 27.02.2024 రోజున ఇవ్వబడిన నోటిఫికేషన్ ఆధారముగా అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించ బడునాని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల యొక్క ప్రొవిజినల్ లిస్ట్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కరీంనగర్ ఆఫీసు నోటీసు బోర్డులో, అధికారిక వెబ్ సైట్ https://karimnagar.telangana.gov.in లో తేది: 15.03.2024 ఉదయం 10.00 గంటల నుండి 16.03.2024 రోజు సాయంత్రం 05.00 గంటల వరకు ఉంచబడుతుందని తెలిపారు.ఇట్టి పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రొవిజినల్ లిస్ట్ పైన ఏవైనా ఆక్షేపణలు , అభ్యర్థనలు ఉన్నట్లైతే సంబంధిత డాక్యుమెంటుతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, కరీంనగర్ గారి కార్యాలయములో తేది: 16.03.2024 రోజు సాయంత్రం 05.00 గంటల లోపు సమర్పించగలరని తెలిపారు.

# నగర పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు కృషి

**- నగర మేయర్ యాదగిరి సునీల్ రావు - స్వచ్ఛ ఆటోలను ప్రారంభించిన మేయర్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు మా పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీస్కుంటుందని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలో గురువారం రోజు నూతనంగా కొనుగోలు చేసిన 6 స్వచ్ఛ ఆటోలను పాలకవర్గ సభ్యులతో కలిసి మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఒక్కొక్క వాహానానికి 8.50 లక్షల రూపాయల చెల్లించి 6 స్వచ్ఛ ఆటోలతో నగర పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఇప్పటికే 310 యంత్రాలు మరియు వాహానాలతో నగరపాలక సంస్థ పారిశుధ్య నిర్వాహణ చేయడం జరుగుతుంది. నగరంలో పారిశుధ్యం మెరుగ్గా ఉండటంతోనే నగరపాలక సంస్థ కు స్వచ్ఛతా ర్యాంకులు, సాయి మిత్ర సురక్షా చాలెంజ్ 4 కోట్ల నగదు బహుమతి లభించింది. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.... నగర పారిశుధ్యంను మరింత మెరుగు పరిచేందుకు... కార్మీకుల పై పని భారం తగ్గించే ందుకు నూతన పారిశుధ్య వాహానాలు కొనుగోలు



చేస్తున్నట్లు తెలిపారు. పెరిగిన జనాభా, నగరీకరణకు అనుగుణంగా పారిశుధ్య నిర్వాహణ చేయడమే లక్ష్యంగా మా పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. నగరంలో 310 వాహానాలతో నగరపాలక సంస్థ నగర పారిశుధ్య పనులు నిర్వహి స్తుందని తెలిపారు. నగరంలో చెత్త లిఫ్ట్ చేసేందుకు 37 ట్రాక్టర్లను వాడటం జరుగుతుందని ఇందులో రెండు ట్రాక్టర్లకు యూజర్ చార్జెస్ వసులు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో పరిసర ప్రాంతాల్లో రోడ్ల పై చెత్త పడకుండ 13 స్టోరేజీ డంపర్ బిన్స్ వినియోగి స్తున్నామని తెలిపారు. అంతే కాకుండా 2 డంపర్ ప్లేసర్స్, 1 జేసీబీ, 1 డోజర్ లను కూడ వివిధ రూపాల్లో పారిశుధ్య నిర్వాహణ కు వినియోగి స్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించేందుకు 53 స్వచ్ఛ ఆటోలను వినియో గిస్తున్నామని... 3 కాంపాక్టర్ వాహానాలు, 99 కాంపాక్టర్ బిన్స్ వాడుతున్నామని తెలిపారు. వాడుతున్న కాంపాక్టర్ బిన్స్ కొన్ని చెడిపో వడంతో 100 కాంపాక్టర్ బిన్స్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో 5 స్వీపింగ్ యంత్రాలతో నగర రహదారులను శుభ్రం చేయడం జరుగు తుందని తెలిపారు. నగరంలో దొమల బెడదను అరికట్టే ందుకు 4 ఫాగింగ్ యంత్రాలను వినియో గిస్తున్నామని తెలిపారు. నూతనంగా పారిశుధ్య పనుల కోసం 18 స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేయగా 6 స్వచ్ఛ ఆటోలను ఈ రోజు ప్రారంభం చేశామని తెలిపారు. పారిశుధ్య పనులను మెరుగు పరిచేందుకు అవసరాన్ని బట్టి వాహానాలను కొను గోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కంటే మాధవి మహేష్, బుచ్చిరెడ్డి, బండారి వేణు, గంట కళ్యాణీ శ్రీనివాస్, నేతి కుంట యాదయ్య, సరిల్ల ప్రసాద్, దిండిగాల మహేష్, వాల రమణ రావు, తోట రాములు, గుగ్గిల్ల జయశ్రీ శ్రీనివాస్, సుధగోని మాధవి కృష్ణ గౌడ్, బండ సుమ రమణ రెడ్డి, ఐలేంధర్ యాదవ్, షకీరా అంజూమ్ బర్కత్ అలీ, నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో సెక్టోరల్ అధికారుల బాధ్యత విస్తృతమైనది

**- అడిషనల్ కలెక్టర్ రాంబాబు**

**సూర్య జగిత్యాల ప్రతినిధి: 02**

రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జగిత్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన సెక్టోరల్ అధికారులకి శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ రాంబాబు మాట్లా డుతూ అన్ని అంశాలలో క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని సెక్టోరల్ అధికా రులు ఈవీఎంలు వివిధ పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పూర్తి పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ దివాకర మాట్లాడుతూ వల్నారేబిలిటీ మ్యాపింగ్, సెక్టార్ మ్యాపింగ్ కనీస వసతులను గురించి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందించాలని పేర్కొన్నారు. జగిత్యాల అసెంబ్లీ కాన్స్టెన్సీ రిటర్నింగ్ అధికారి పులి మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటుగా అందరి అధికారులతో కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా పోలింగ్ స్టేషన్లకు అవసరమైన వసతులు, రాబోయే ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన వనరులను గురించిన పూర్తి నివేదికను



అందించాలని పేర్కొన్నారు. కోరుట్ల రిటర్నింగ్ ఆఫీసర్ ఆనంద్ కుమా ర్ మాట్లాడుతూ ప్రతి చిన్న అంశం కూడా వదిలిపెట్టకుండా ఎన్నికల ప్రవర్తన నియమాల్ని అను సరించి అధికారులు నడుచు కోవాలని పేర్కొన్నారు. తదనంతరం రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ డాక్టర్ పడాల తిరుపతి మాట్లాడుతూ సెక్టోరల్ ఆఫీసర్స్ రిటర్నింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రక్రియకు అందరికి కూడా ఒక రిప్లిక లాంటి వారు కాబట్టి నియామకం కాబడినప్పటినుండి ఎన్నికల ప్రక్రియ ముగిసి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు ఉంటుంది అని, జోనల్ మెజిస్ట్రేరియల్ పవర్ కలిగిన అధికారిగా అన్ని రకాల అంశాలలో పూర్ణమైన విజ్ఞానాన్ని కలిగి ఉండాలని పోలింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గతంలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఏ విధంగా నిర్వహించారో అదే విధంగా పార్లమెంట్ ఎన్నికలలో కూడా పూర్ణమైన పరిజ్ఞానంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. జగిత్యాల జిల్లా లో ఎలాంటి మిస్టేక్ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, రిటర్నింగ్ అధికారులకు అందించే వివిధ రకాల డాక్యుమెంట్స్ సరైన సమయంలో అందించాలని శిక్షణను అందించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్ వ్యవహరించారు.



## ఆహారం లో చిరుధాన్యాలు తప్పక తీసుకోవాలి

**సూర్య కొడిమ్యాల**

గురువారం రోజు పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కొడిమ్యాల మండల కేంద్రము లోని సెక్టార్ అంగన్వాడీ సెంటర్ లో పోషణపక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లులను ఉద్దేశించి అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలా గురించి వివరించారు. ప్రతి రోజు వారి ఆహారంలో తప్పనిసరిగా చిరుధాన్యాలు తీసుకోవాలని తద్వారా రోగనిరోధక శక్తి శరీరానికి కావలసిన అన్నిరకాల పోషకాలు లభిస్తాయని అలాగే ప్రతి ఒక్కరూ తాజా ఆకుకూరలు, కూరగాయలు పండ్లు తీసుకోవాలని ప్రీస్కూల్ విద్య ప్రాముఖ్యత గురించి వివరిస్తూ అంగన్వాడీ లో నిర్వహించే పూర్వప్రాథమిక విద్యా కార్యక్రమాల ద్వారా పిల్లలు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని అలాగే అంగన్వాడీ లోని లెర్నింగ్ కార్నర్స్ ద్వారా పిల్లల మేధోవికాసం కుంటు పడకుండా ఉంటుందని పిల్లలు ఆడుకోవడానికి బొమ్మలను స్వదేశీ బొమ్మలు ఉపయోగించే విధంగా స్వదేశీ బొమ్మల ప్రాముఖ్యత పై తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం తల్లులతో పోషణాప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి ,ఆయా పద్మ, పిల్లలు, తల్లులు,తదితరులు,పాల్గొన్నారు.

## నూతన సొసైటీ కార్యాలయం, గోదాం ప్రారంభం

**- వ్యయ, ఆదాయాలు రైతులకు వివరించాలి**

**సూర్య మల్లాపూర్**



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఎరువుల గోదాం, కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం సహకార పరపతి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోదూరి రవీందర్ రావు, కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు సొసైటీలో దాన్యం విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన సొసైటీ సభ్యుడు మోరపు గంగారాజం మండల కేంద్రంలోని సొసైటీ ధాన్యం కొను గోలు కేంద్రాల నిర్వహణ పై లభించే కమీషన్ తెలుపకుండానే నిర్మాణ పనులకు 40లక్షల పైగా లోన్ తీసుకున్నారని సొసైటీ నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ రావుకు ఫిర్యాదు చేసారు. అదాయ వ్యయాలకు సంబంధించి సొసైటీ అధ్యక్షులు, సిబ్బంది ఎలాంటి వివరాలు తెలపడం లేదని విచారణ జరిపి తగు చర్యలు తీసు కోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై ఉన్నత అధికారులను వివరణ కోరగా సొసైటీ కొనుగోలు కేంద్రాల నిర్వహణ కమీషన్ డబ్బులు జమ కాలేదని. నా బార్డ్ ద్వారా నిర్మాణానిమి లోన్ తీసుకున్నది వాస్తవమేనని తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆదాయ, వ్యయాల్లో ఏం జరుగుతుంది..? ఎవరు ప్రధాన పాత్ర వహిస్తున్నారాని చర్చలు మొదలయ్యాయి. ఏదిఏమైనా అధికారులు విచారణ చేపడతారా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తారా వేచి చూడాలి.



## అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ్

**సూర్య జగిత్యాల టౌన్**

జగిత్యాల పట్టణంలోని 28 వార్డు చింతకుంటవాడలో గురువారం పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో సిడిపిఒ ఏం. వీరలక్ష్మి, మాట్లాడుతూ పోషన్ భీ పడాయి భీ నినాదంతో ఈ సంవత్సరం మార్చి 9 నుండి 23 వరకు పోషణ్ పఖ్వాడ కార్యక్రమములు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రములో అందిస్తున్న బాల్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్య, పోషకహారం గురించి వివరించారు. ప్రతి రోజు మిల్లెట్స్ తీసుకొనటం వలన రక్తహీనత, ఐరన్, విటమిన్స్ లోపం ఏర్పడకుండా ఉంటామని, మిల్లెట్స్ లోని రకాలు, వాటిని తీసుకొనటంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పాఠశాలలోని పిల్లలకు, కిశోర బాలికలకు తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మేక పద్మావతి పాల్గొని గర్భిణీలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రసాన చేసారు. అంగన్వాడీ కేంద్రములలో ఫ్రీ స్కూల్ విద్య, పోషకాహారం సక్రమంగా అందించాలని అంగన్వాడీ సేవలను అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్వైసర్ జి.జానకి, పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినెటర్ , అంగన్వాడి టీచర్లు జ్యోతి, ఇంద్రజ, లక్ష్మీ, అరుణ, శ్రీలత పాఠశాలలోని పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**సూర్య -కోరుట్ల**

కోరుట్ల పట్టణంలోని 22 వార్డు లో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్లసంజయ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 41 రోజులు మాలధారణ వేసుకున్న స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చివరి రోజు వరకు నిర్వహిస్త మనీ ఈ కార్యక్రమంలోఆలయ కమిటీ అధ్యక్షులు టేకుల నరేష్ , ఆలయ గురుస్వామి మాడవెని సురేష్ , బిజెపి ఫ్లోర్ లీడర్ మాడవేణి నరేష్ ,మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, ఏబీ విపిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాడవేని సునీల్ కుమార్,బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మాడవేని స్వప్న , గడ్డం సంధ్య, . కౌన్సిలర్స్ జిందం లక్ష్మీనారాయణ ,ఆడెపు కమల మధు, గంధం గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ శ్రీనివాస్ ,బొమ్మన విజయ్ కుమార్ ,మగ్రిపల్లి రవి గౌడ్ ,మగ్రిపల్లి శంకర్ గౌడ్, మహేష్ ,పవన్, సంద శ్రీపతి, సల్ల శ్రీకాంత్, గుగ్రాల సాయి కృష్ణ,సల్ల నవీన్, చింతకుంట రమేష్,అంది వంశీ, చెట్లపల్లి శ్రీనివాస్ ,అంజన్న మాలదారులు వార్డు ప్రజలు నాయకులు పాల్గొన్నారు. మొదటిరోజు అంజన్న మాలధారణ వేసుకున్న స్వాములు ఒక వంద మూడు103 స్వాములకు అన్నదాన కార్యక్రమం మొదటిరోజు భిక్ష పెట్టడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.






## భక్తుల కొంగుబంగారం శ్రీ లక్ష్మినరసింహ స్వామి దేవాలయం

**సూర్య వెల్గటూర్**



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట గ్రామా పంచాయతీ పరిధిలోని గుట్ట పై వెలసిన దివ్యక్షేత్రం. గుట్ట పై భాగాన రెండుగా చీలిన బాండ సొరంగం లో బండ రాయి పై స్వయంభూగా వెలిసిన శ్రీ నాగపెల్లి లక్ష్మీనరసింహుడు కొలువు తీరి కొలిచిన భక్తులకు కొంగుబంగారమై నీరాజనాలందుకుం టున్నారు. భక్తుల కొంగుబంగారం గా పేరొందిన ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మార్చి నెలలో కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా 5 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమం ఆలయ అర్చకులు, వేద మంత్రాల మధ్య నిర్వహిస్తారు. స్వామి వారి కల్యాణానికి సైతం ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. వేలాది భక్తులు అజరైయ్యే ఈ జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బం దులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తారు. ప్రతి ఏడు శ్రావణ మాసంలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోరిన కోర్కెలు తీర్చిన నాగపెల్లి లక్ష్మి నరసింహస్వామి భక్తి శ్రద్ధలతో దర్శించుకొని మొక్కులు చెల్లించి, వెంట తీసుక వచ్చిన యటాలను ఎదిరించి కోసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేస్తారు. ఇక్కడి నాగపెల్లి లక్ష్మి నరసింహుడి క్షేత్రం మహత్యం మహా అద్భుతం, ఈ కొండ రాళ్ళ కు ,చెట్లకోమ్మలకు వందల కొద్ది తేనెటీగలుంటాయి. శుభ్రత పాటించకుండా ఆలయానికి కొస్తే తేనెటీగలు శిక్షణ భటులుగా వారిని వెంబడించి ముఖ ద్వారం దాటించే వరకు వదలవు. స్వామివారికి మొక్కులు మొక్కి, ఆపదలు తీరిన తర్వాత మర్చిపోతే స్వామివారు వారికి వెంటనే గుర్తు చేస్తుంటారాట అనేది భక్తుల ప్రగాఢ నమ్మకం.

## పోషణ పక్షోత్సవాలపై అవగాహన కార్యక్రమం

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత రాణి**

**సూర్య జగిత్యాల అర్బన్**



జగిత్యాల పట్టణంలో నీ కృష్ణానగర్ లో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషణ పక్షోత్సవాలు మార్చి తొమ్మిది నుండి 23 వరకు నిర్వహించబడుతాయని తెలిపారు. ముఖ్యంగా ఈ పోషణ పక్వాడ థీమ్స్ అని గిరిజన సాంప్రదాయ ఆహార పద్ధతుల పోషకాహారాలపై అవగాహన కల్పించడం, గర్భవతి పోషక ఆహార పద్ధతులపై చిన్నపిల్లల ఆహార ఆచరణ పై అవగాహన ,బాల్యారంభ విద్య , లెర్నింగ్ కార్నర్స్ గురించి వివరణ, స్వదేశీ బొమ్మల ప్రదర్శన ఆటపాటలతో కూడిన బాల్య ఆరంభ విద్యా బోధనపై ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత రాణి అవగాహన కల్పించారు. ఆహారంలో చిరుధాన్యాల పోషక విలువలు అందించడాన్ని వివరించారు. బాల్యారంభ విద్యతో చిన్నపిల్లలు మానసిక వికాసం తో పాటు శారీరక దారుఢ్యం, మేధో వికాసం ,సృజనాత్మకత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు కావాల్సిన ఆహార పదార్థాలను ,ఆట వస్తువులను సమకూర్చి ప్రభుత్వం బాల్యారంభవిద్యకు ఎంతగానో సహాయపడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐసిడిఎస్ సూపర్వైజర్ కవితా రాణి తో పాటు అంగన్వాడి టీచర్లు అరుణకుమారి పెంటకర్ సౌజన్య , జోష్ణ ,పవిత్ర , ఆశ పావని వార్డులో గల తల్లిదండ్రులు ,పిల్లలు వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ పై దాడులు..

**సూర్య, మెట్ పల్లి టౌన్**



పట్టణంలోని వాటర్ ప్లాంట్ లపై ౧ ౦ మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహి ంచినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐ.ఎస్.ఐ లైసెన్స్ తో వాటర్ ప్లాంట్ నడపాలని, నాణ్యత ప్రమాణాలను పాటించకుండా నీటిని అమ్మినచో కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం ఐ.ఎస్.ఐ లైసెన్స్ లేకుండా నిర్వహించే మూడు వాటర్ ప్లాంట్లకు, ఒక్కొక్కరికి 1500 చొప్పున జరిమానా విధించారు. అనంతరం వారికి 15 రోజుల గడువు ఇచ్చి లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నాయక్, నిజం లు పాల్గొన్నారు.

# భూగర్భ గనుల్లో పైకప్పు ప్రమాదాలను ముందస్తుగా గుర్తించే ఆధునిక సాంకేతికత

**-ఉన్నతాధికారులకు వివరించిన ఆస్ట్రేలియా బృందం -ప్రయోగాత్మకంగా ఒక గనిలో ఏర్పాటుకు పరిశీలన**

**-సింగరేణి సిఅండ్ఎండి నేనావత్ బలరాం**

**సూర్య, సెంటినరీ కాలనీ**

భూగర్భ గనులను నూరు శాతం ప్రమాద రహిత గనులుగా రూపొందించడం కోసం సింగరేణి యాజమాన్యం అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని, మేలైన సాంకేతికతను వినియోగించడానికి సింగరేణి సిద్ధంగా ఉందని సంస్థ చైర్మెన్ అండ్ ఎండి నేనావత్ బలరామ్ పేర్కొన్నారు. భూగర్భ గనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడం కోసం ఆస్ట్రేలియా దేశానికి చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును గురువారం నాడు హైదరాబాద్ సింగరేణి భవన్ లో పరిశీలించిన తర్వాత పై ఆయన ఉన్నత స్థాయి అధికారులతో చర్చిం చారు. భూగర్భ గనుల్లో రక్షణ చర్యలు ఎన్నో తీసుకున్నప్పటికీ అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన సంఘటనలు గతంలో అనేకం జరిగాయి. కాగా ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ పరిశోధన



సంస్థ నోమ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పై కప్పు ప్రమాదాలు జరగకముందే ముందస్తు హెచ్చరి కలు జారీ చేసే ఒక యంత్ర విభాగాన్ని రూపొం దించారు. దీనివల్ల పైకప్పు ప్రమాదం జరగక ముందే గనిలోని కార్మికులను అధికారులు హెచ్చరిస్తూ ఫ్లాష్ లైటింగ్ ద్వారా కానీ సైరన్ ద్వారా గాని ఇది అప్రమత్తం చేస్తుంది. దీనివల్ల ప్రమాదాన్ని నివారించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకొని, ప్రాణ నష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుంది. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణి సంస్థలో కూడా వినియోగించాలని కోరుతూ ఆస్ట్రేలియాకి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్ ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్ ఫిన్ లైన్ సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్ బలరాం, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డి ) ఎస్.డి.ఎం సుభాని డెమో స్టేషన్ ద్వారా వివరించారు. దీనిపై డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ జి. వెంకటేశ్వర్ రెడ్డి వివరిస్తూ ప్రమాదాల నివారణకు ఇప్పటికే సింగరేణి సంస్థ అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజా ్ఞనాన్ని వినియోగిస్తుందని, భూగర్భంలో పై కప్పు కిందికి జారడం పైన ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే ఈ కొత్త సాంకేతికత వల్ల ప్రమా దాలను నూరు శాతం అరికట్టే అవకాశం ఉంద న్నారు. జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డి )ఎస్. డి.ఎం సుభాని మాట్లాడుతూ ఆస్ట్రేలియా బృందం వారు ఇచ్చిన డెమోనిస్ట్రేషన్ ను పరిశీలించామని, దీనిపై ఉన్నత స్థాయిలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

## సింగరేణి నోటిఫికేషన్ లో మార్కుల శాతం 55 శాతం కి తగ్గించాలని మంత్రికి వినతి

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ విడుదల చేసిన నోటిఫికేషన్ లో మార్కుల శాతం 55 శాతం కు తగ్గించాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి నిరుద్యోగులు వినతిపత్రం అందజేశారు. బీటెక్ మైనింగ్ పూర్తి చేసి ఎన్నో రోజులుగా మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న మా అందరి గురించి ఆలోచించి సింగరేణి సంస్థ ద్వారా ఖాళీలను భర్తీ చేయుటకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, కానీ ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ నం .01/2024 లో మార్కుల శాతం 60 శాతం నిబంధన ఉండడం వల్ల మేము తీవ్రంగా నష్టపోతున్నామని, గతంలో సింగరేణిలో ఇచ్చిన నోటిఫికేషన్ 2010 సంవత్సరంలో నోటిఫికేషన్ నెంబర్ 4/2010, 2017లో ఇచ్చిన నోటిఫికేషన్ నెంబర్ 5/ 2017 ద్వారా చేపట్టిన నియామకాల నోటిఫికేషన్ 55 శాతం మార్కుల నిబంధన పెట్టడం జరిగిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఎన్నో రోజులు ఎదురు చూస్తున్న మాకు గతంలో లాగా 55 శాతం మార్కుల నిబంధన కాకుండా 60 శాతం పెట్టడం వల్ల దాదాపు 250 మంది 2018 వ సంవత్సరం నుండి ఎదురుచూస్తూ సింగరేణిలోనే అన్ పేడ్ అప్రెంటిషిప్ ద్వారా బొగ్గు గనుల్లో పని చేస్తున్న మేము అవకాశాన్ని కోల్పోతున్నామని, కావున మా యందు దయ తలచి సింగరేణి సిఅండ్ఎండి బలరాం తో మాట్లాడి గతంలో ఇచ్చిన విధంగా మార్కుల నిబంధనను 55 శాతం కి తగ్గించి పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. సమస్య విని సాను కూలంగా స్పందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ప్రదీప్, ఎం.గణేష్ ,ఎస్.శ్రీకాంత్, డి.రమేష్, యు.ప్రశాంత్, టీ.మహేందర్, సిహెచ్.సాయి సుష్మత్, ఎం. ప్రవీణ్, జే.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువు లో పూడిక పనులు పరిశీలన

**సూర్య -పెద్దపెల్లి రూరల్**

మండలంలోని చీకురాయి , పెద్దబొంకూర్ గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం ఉపాధి హామీ లో జరుగుతున్న చెరువు పూడిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించాలని అన్నారు. వేసవికాలం దృష్ట్యా పంచాయతీ నుండి మంచినీటి వసతి, తాత్కాలిక చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు . ఆయన వెంట ఏపీ ఓ రమేష్ బాబు, టి ఏ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.





## లక్ష్య సాధన తోనే మెరుగైన ఫలితాలు

**- కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జాహెద్ పాషా**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

పదవ తరగతి విద్యార్థులు లక్ష్య సాధన తో చదివితేనే మెరుగైన ఫలితాలు సాధిస్తారని కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జాహెద్ పాషా అన్నారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఈ నెల 18 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాలు సాధించడం కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రణాళిక, పట్టుదల ,ఏకాగ్రతతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులు తమ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి ఆందోళనకు గురికావద్దన్నారు. గ్రామాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారిని ఆదర్శంగా తీసుకొని,కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాలో కాల్వ శ్రీరాంపూర్ మండల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

## వ్యవసాయ మార్కెట్ దుకాణాల సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.

**సూర్య పెద్దపల్లి**



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ లో రెండు కోట్ల పది లక్షల తో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ దుకాణాల సముదాయానికి చెందిన 15 షెట్టర్లను గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మార్కెట్ కమిటీ దుకాణాల సముదాయానికి చెందిన షట్టర్లను ప్రభుత్వానికి ఆదాయం సమకూరే దిశగా ఓపెన్ టెండర్ల ద్వారా పారదర్శకంగా కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ, అధికారులు, సిబ్బంది, జెడ్పీటిసి బండారు రాంమూర్తి , పట్టణ కౌన్సిలర్లు నుగిళ్ళ మల్లయ్య, సయ్యద్ మస్రత్, భూతగడ్డ సంపత్, సందవెని రాజేందర్, తాండూరు శ్రీమాన్, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, జగదీష్, నేతేట్ల కుమార్, ఈర్ల స్వరూప, బొడ్డుపల్లి శ్రీనివాస్, గంట రమేష్, కలవేన మహేందర్, ఆంజనేయ రావు, కడర్ల శ్రీనివాస్, గుండేటి ఐలయ్య, సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ వెంచర్ లో హద్దురాళ్లు తొలగింపు..

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలంలోని కొత్తపల్లి గ్రామం లో అక్రమ వెంచర్ లో డీఎల్పీవో వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాస్ అదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది తో హద్దు రాళ్లను తొల గి ంచారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ మాట్లాడుతూ పంచాయతీ అనుమతులు లేకుండా వెంచర్లు పెట్టకూడదని, అలాంటి వాటిలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయకూడదని సూచించారు. అనుమతులు లేని వెంచర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో సుదర్శన్, సిబ్బంది వున్నారు.



## విద్యార్థి దశలో సేవా దృక్పథం రావాలి...

**- గాయత్రీ విద్యా సంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్**

**సూర్య-పెద్దపల్లి రూరల్**

విద్యార్థి దశలో సమాజసేవ చేయడం వలన భవిష్యత్తులో సేవ దృక్పథం ఏర్పడుతుందని గాయత్రీ విద్యా సంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ విద్యార్థులకు తెలియజేశారు. గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం మండలంలోని మారేడు గొండ లో నాలుగు రోజులుగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులు తిరుగుతూ తడి చెత్త,పొడి చెత్తను వేరు చేయడం, ఇంకుడు గుంత, మరుగుదొడ్లు మరియు మిషన్ భగీరథ నీటి కులాయి మొదలైన అంశాల గురించి సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రమేష్ (ఇంపాక్ట్ మోటివేటర్) మాట్లాడుతూ మోటివేషన్ అంటే మనసులో ఉన్న పవర్ బయటికి తీసుకురావడం, ఎడ్యుకేషన్ ఈస్ ఆల్ రౌండ్ డెవలప్మెంట్, జీవితంలో ని తీసేస్తే పాజిటివ్ ఆటోమేటిగ్గా వస్తుంది, లైఫ్ లో సక్సెస్ కావాలంటే పేషెన్సీ ,డిసిప్లేన్ చాలా అవసరమని ఎన్ఎస్ఎస్ వాలంటరీలకు తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ జానకి దేవి, ఆర్. ఎం.పి డాక్టర్ శ్రావణ్ మారేడు గొండ , ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏం .ఏ. సమద్, అధ్యాపకులు సదానందం, ఆమని ,ఎన్.ఎస్.ఎస్ వాలంటరీస్ పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులోనే గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం చేయాలి

**- కార్యదర్శికి వినతిపత్రం**

**సూర్య -పెద్దపెల్లి రూరల్**

మండలంలోని అప్పన్నపేట గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజీవ్ రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు . నూతన గ్రామ పంచాయతీ భవనం వినాయకనగర్ లోని వాటర్ ట్యాంక్ వద్ద నిర్మాణం చేస్తున్నారని, అక్కడ వెళ్లాలంటే రాజీవ్ రహదారి దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ దళిత నాయకులు దుర్గయ్య మాజీ వార్డు సభ్యులు వెంకటేశం,నరేష్ ,ముదిరాజ్ సంఘం నాయకులు సదయ్య ,విశ్వకర్మ గ్రామ కార్యదర్శి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



# రెడ్డి కార్పొరేషన్ కు 2000 కోట్లు కేటాయించాలి

**-చట్టబద్ధంగా వచ్చే ప్రయోజనాల కోసం పోరాటం - రెడ్డి సంక్షేమ సంఘం**

**సూర్య, హుజురాబాద్**



ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, కేవలం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించకపోతే అది వృధా అని, దానికి 2000 కోట్ల నిధిని ఏర్పాటు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పోరెడ్డి శంకర్ రెడ్డి, సారాబుడ్ల ప్రభాకర్ రెడ్డి, ఎడవెల్లి కొండల్ రెడ్డి, కంకనాల సరోజనలు మాట్లాడుతూ రాష్ట్రంలోని రెడ్డి పేద రైతుల సంక్షేమం కోసం రెడ్డి కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని ఎన్నో పోరాటాలు ఇంతకాలం చేయడం జరిగిందని అన్నారు. పోరాటాల ఫలితంగా ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కేవలం కార్పొరేషన్ ఏర్పాటుతోనే పని పూర్తి కాలేదని, కార్పొరేషన్ విధివిధానాలు నిధులు ఉన్నప్పుడే కార్పొరేషన్ ఏర్పాటు వల్ల రెడ్డిలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రెడ్డి కార్పొరేషన్ కు బడ్జెట్ ఉన్నప్పుడే కార్పొరేషన్ వల్ల పనులు జరుగుతాయని, లేకపోతే అలంకారప్రాయం అవుతుందని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా రెడ్డి లకు వచ్చే ప్రయోజనాలు రావడం కోసం ఐక్యంగా పోరాటాలు చేస్తామని అన్నారు. రెడ్లలో 60 శాతం పేదవారు ఉన్నారని, వారి ప్రయోజనం కోసం హామీలు ఇచ్చి మర్చిపోకూడదని అన్నారు. జిల్లాకు ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని అన్నారు. రెడ్డిలలో కొంత మంది మాత్రమే ధనవంతులు ఉన్నారని, మిగతావారు కాయ కష్టం చేసుకుని బతికే వారు ఉన్నారని, వారికి ఈ కార్పొరేషన్ వల్ల ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ముచ్చ సమ్మిరెడ్డి, పోరెడ్డి కిషన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, రూపురెడ్డి నిరంజన్ రెడ్డి, బీరం శ్రీధర్ రెడ్డి, రాజిరెడ్డి, కటుకూరి కోమల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, కంకణాల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

**- నల్ల కొండల్ రెడ్డి**

**సూర్య, వీణవంక**

తెలంగాణ రాష్ట్రంలో గత దశాబ్దకాలంగా రెడ్డి కులాలలో నిరుపేద రెడ్డిల సంక్షేమం దృష్ట్యా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లకొండాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వీణవంకలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి కి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం జరిగిన పోరాటంలో ఎన్నో ఉద్యమాలు చేసిన క్రమంలో 2017 జరిగిన రెడ్డి మహా గర్జన సభకు ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆ సభలో మేము అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాటిచ్చి అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోనే కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకు వీణవంక రెడ్డి సంఘం పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీవిఆర్ఆర్ ఈసీ మెంబర్, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల కొండాల్ రెడ్డి, మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు మూల పుల్లారెడ్డి, జిల్లా నాయకులు కర్ర భగవాన్ రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, గంగాడి తిరుపతి రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మ్యాకల ఎల్లారెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి, పత్తి సమ్మిరెడ్డి, పోరెడ్డి తిరుపతి రెడ్డి, కంకణాల జగన్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, బైరెడ్డి సురేందర్ రెడ్డి, గూటం సమ్మిరెడ్డి, బొబ్బల కోమల్ రెడ్డి, మీరాల సమ్మిరెడ్డి, నాగిడి రామ్ రెడ్డి, చదువు జైపాల్ రెడ్డి, ఆలేటి శ్రీపాల్ రెడ్డి, జున్నుతుల మధుకర్ రెడ్డి, అల్లువెళ్ళి మోహన్ రెడ్డి, కర్ర విశ్వనాథ్ రెడ్డి, మహకల శ్యాంసుందర్ రెడ్డి, మారం తిరుపతి రెడ్డి, మ్యాకల సమ్మిరెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, అల్లపురెడ్డి దేవేందర్ రెడ్డి, కొర్ని ధర్మారెడ్డి, కర్ర తిరుపతి రెడ్డి, బొబ్బల దామోదర్ రెడ్డి, కామిడీ శ్రీకాంత్ రెడ్డి, కర్ర కుమార్ రెడ్డి, గూటం హరిప్రసాద్ రెడ్డి, పత్తి కొండాల్ రెడ్డి, మాడుగురి సమ్మిరెడ్డి, కోర్ని సమ్మిరెడ్డి, ఎడేల్లి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16 కార్పొరేషన్లు ఏర్పాటు చారిత్రాత్మకం

**- కాంగ్రెస్ నాయకులు**

**సూర్య, వీణవంక**



16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఇందిరమ్మ స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని కొనియాడారు. 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా కులాల వారందరికీ చేయూత దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలవేణి సదయ్య, ఎలవేణి రమేష్, ఈదునూరి అనిల్, గొడుగు మల్లేష్, కొలిపాక రాజయ్య, కొలిపాక ఆంజనేయులు, కొయ్యడ చిన్నన్న, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## మహిళలు చైతన్యవంతులు కావాలి

**- బాలవికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన**

**సూర్య, వీణవంక**

నేటి సమాజంలో మహిళలు చైతన్యవంతులు కావాలని బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి(కల్లుపల్లె) గ్రామంలో గురువారం బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జమ్మికుంట బాల వికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ మహిళా లోకం చైతన్యవంతమై సమాజంలో జరిగే మోసాలపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చునని అన్నారు. తల్లి గర్భంలో ఉన్న పిల్లల నుండి కాటికి పోయే శవం వరకు అందరూ వినియోగదారులేనని, వినియోగదారుల పరిరక్షణ చట్టం 1986లో వచ్చినప్పటికీ ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయలేకపోవడం వల్ల పాశుపథాస్త్రం లాంటి ఈ చట్టం కూడా మిగతా చట్టాల లాగే నీరు కారిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ఈ చట్టం పట్ల సామాన్య ప్రజలలో అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఆమె అన్నారు. దుకాణాలలో మనం కొనుగోలు చేసే వస్తువుల పైన ముద్రించి ఉన్న లేబుళ్లను నిశితంగా పరిశీలించిన తరువాతనే వస్తువులను కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఆమె సూచించారు. బిల్లులు తీసుకున్నప్పుడే ఏదైనా మోసం జరిగితే వినియోగదారుల ఫోరంలో కేసు వేయవచ్చునని, కేసు వేస్తే నష్టపోయిన వినియోగదారులకు కోర్టు ఖర్చులతో సహా నష్టపరిహారం చెల్లిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ సుమలత, బాలవికాస సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

**సూర్య, హుజురాబాద్**



రెడ్డి కులస్తుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం హుజురాబాద్ పట్టణంలో రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణవ్ బాబుల కు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరి స్వామి రెడ్డి, కాగిత రాంరెడ్డి, గంటా కిరణ్ రెడ్డి, ప్రతాప నాగరాజు, వెంకట్ రెడ్డి, శంకర్, కంకణాల సరోజన, జనార్ధన్ రెడ్డి, ఎగ్గటి సంజీవ రెడ్డి, అయిత హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**పెరిక కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం....**

పెరిక కార్పొరేషన్ ఏర్పాటు పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలభిషేకం గురువారం హుజురాబాద్ పట్టణంలో పెరిక సంఘం నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు మీస రమేష్, బండి రమేష్, భారత ప్రభాకర్, అంకతి శ్రీనివాస్, భారత రజనీకాంత్, సంధ్యల వెంకన్న, ముక్కెర కనకయ్య, ఉగ్గే పరమేశ్వర్, పోతరాజు వీరయ్య, శ్యామ్ సుందర్, విజయ భాస్కర్, రాజయ్య, లక్కర్సు యాదగిరి, మైదాంశెట్టి శివ, సంధ్యల రఘువర్ధన్, బండి రాహుల్, కొన జయంత్, భారత మహేందర్, బండి లక్ష్మణ్, అచ్చే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు పిఎంకె ఫౌండేషన్ ఉదారత

**సూర్య, జమ్మికుంట రూరల్**



పిఎంకె ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన దాసరి బిక్షపతికి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. దీంతో అతనికి డయాలసిస్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. విషయం తెలుసుకున్న (పల్లె మొగిలయ్య - కనకమ్మ జ్ఞాపకార్థం తల్లిదండ్రుల పేరు మీద) పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ కిడ్నీ వ్యాధిగ్రస్తుడైన దాసరి బిక్షపతి కుటుంబానికి నెలకు రూ. 2500 చొప్పున సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకుల ద్వారా బిక్షపతి నివాసంలో కుటుంబానికి 2500 రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా అనారోగ్యంతో బాధపడే కుటుంబాలకు తాను అండగా, ఆసరాగా నిలబడతానని తెలిపారు. ముందు ముందు మరిన్ని ఫౌండేషన్ తరపున సామాజిక సేవ కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడి ఉండి తల్లిదండ్రులు తమ బిడ్డలను చదివించుకోలేనీ స్థితిలో ఉన్న కుటుంబాలకు, అదే విధంగా వైద్యం చేయించుకోలేని కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తానని తెలిపారు. ఇలాంటి సమస్యలు ఉంటే ఫౌండేషన్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వాలని పల్లె ప్రభాకర్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లె రవి గౌడ్, గండి రంజిత్ కుమార్ గౌడ్, కడవెరుగు సంపత్, డాక్టర్ గోపి, బండారి శ్రీనివాస్ యాదవ్, తాటిగంటి వీరస్వామి, కారుపాకల వెంకన్న, గొడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**సూర్య - మానకొండూర్ :**



పెరిక కులస్తుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటుకై క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ మానకొండూరు మండల కేంద్రంలో పురగిరి చత్రియ పెరిక సంఘం మండల అధ్యక్షులు కానిగంటి మల్లి కార్జున్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి,రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే.డా. కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెరిక సంఘం జిల్లా నగర ప్రధాన కార్యదర్శి బోల్ల మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వం పెరిక కులస్తులను చిన్న చుపు చూసి అభివృద్ధిని విస్మరించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెరిక కులస్తులకు సముచిత స్థానం అందిస్తూ వారి అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్,దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు పెరిక కులాబాంధవుల అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులకు ఓట్లు వేసి తమ మద్దతు తెలుపుతమన్నారు.ఈ కార్యక్రమంలో పురగిరి చత్రియ పెరిక సంఘం మండల అధ్యక్షుడు కానిగంటి మల్లికార్జున్,రాష్ట్ర నాయకులు సాయిరి దేవయ్య , జిల్లా కార్యదర్శి బెడద సుధాకర్ , తంశెట్టి రాజేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు పెట్టం సంపత్, జిల్లా సలహాదారుడు మీస సత్యనారాయణ,మండల ఉపాధ్యక్షులు కాని గంటి కుమార్, ప్రధాన కార్యదర్శి మీస శ్రీనివాస్ ,రాయినేని రమణ, దాసరి రవి, మైదంశెట్టి కుమార్, ముద్దసాని కార్తీక్, మీస రమణయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

**సూర్య, వీణవంక:**

కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు జరిగిన సంఘటన వీణవంక మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం వీణవంక మండలం కోర్కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ రాగా వివిధ కుల సంఘాల నాయకులు దాదాపు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు వారిని పార్టీలోనికి ఆహ్వానించి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కర్ర భగవాన్ రెడ్డి, ఎక్కటి రఘుపాల్ రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, సతీష్ గౌడ్, నల్ల కొండల్ రెడ్డి, పత్తి సమ్మిరెడ్డి, గట్టయ్య, శ్రీపతి రెడ్డి, అడిగోప్పుల సంపత్, బిక్షపతి, కర్ర రామ్ గోపాల్ రెడ్డి, కర్ర విశ్వనాథరెడ్డి, రామ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, పైడి కుమార్, అనిల్ రెడ్డి, జడల శ్రీకాంత్, మాదాసి సునీల్, రజాక్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల ఉపాధి కోసం 24 గంటల దీక్ష

సూర్య సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని ప్రభుత్వం వెంటనే నివారించే విధంగా చర్యలు చేపట్టాలని వస్త్ర పరిశ్రమలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి పవర్లుమ్ అనుబంధ రంగాల కార్మికు లందరికీ వెంటనే ఉపాధి కల్పించాలనే డిమాండ్ తో సిఐటియు-పవర్లుమ్, అనుబంధ రంగాల యూనియన్ల ఆధ్వర్యంలో సిరిసిల్ల కొత్త బస్టాండ్ ఏరియాలో 24 గంటల నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎం.డి అబ్బాస్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూరపాటి రమేష్ పాల్గొని దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ సిరిసిల్లలో గత 3 నెలల నుండి పరిశ్రమ సంక్షోభం వలన సరైన ఉపాధి లేక నేతన్నలు పస్తులు ఉంటున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సిరిసిల్లలో నేతన్నల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఉందని గుర్తు చేశారు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే సిరిసిల్లలో నేతన్నల



ఆకలి చావులు ఆత్మహత్యలు మళ్లీ పునరావృతమయ్యే అవకాశం ఉందని, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే కేటీఆర్ కూడా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి నేతన్నలకు తక్షణమే ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని లేకుంటే సిరిసిల్ల నేతన్నలదరితో పెద్ద ఎత్తున ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరి ంచారు. ఈ దీక్షలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్, జిల్లా అధ్యక్షులు కోడం రమణ, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం,కుమ్మరి కుంట కిషన్, ఆడెపు సంపత్, గుండు రమేష్,మోర తిరుపతి, కంది మల్లేశం, రాము,అంబదాస్, రామచంద్రం పాల్గొన్నారు.

**దీక్షకు సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ నాయకులు.**

భారత రాష్ట్ర సమితి పార్టీపై కోపంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులను పస్తులుంచవద్దని,వారికి ఎప్పటిలాగే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వర్గానికి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని బి ఆర్ఎస్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా సిరిసిల్ల ప్రాంతానికి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి ఇక్కడి కార్మికులను ఆదుకోవడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా నేత కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాపై కోపం ఉంటే రాజకీయపరంగా చూసుకుందామని అంతేగాని కార్మికులను పస్తులుంచవద్దని కోరారు. కార్మికులకు ఉపాధి కల్పించకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున మహాధర్నా చేపడతామని తోట ఆగయ్య, జిందం చక్రపాణి, గూడూరు ప్రవీణ్,బొల్లి రామ్మోహన్,గుండ్లపెల్లి పూర్ణచందర్ తదితరుల పాల్గొన్నారు.






## విశ్వబ్రాహ్మణల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సూర్య సిరిసిల్ల టౌన్

తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి స్ఫూర్తితో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం శోషనీయమని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చందనగిరి గోపాల్ అన్నారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ అధ్యక్షులు చందనగిరి గోపాల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో బిసి,ఎస్సి,ఎస్టి 16 కులాలకు కార్పొరేషన్ ప్రకటించడం జరిగినదని,ప్రకటించిన కార్పోరేషన్ లో విశ్వబ్రాహ్మణ వర్గానికి కార్పోరేషన్ ప్రకటించకపోవడం శోచనీయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు అమరుడైన శ్రీకాంతచారి స్ఫూర్తితోనే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడం జరిగినదనీ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం జరిగినదనీ,తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్,శ్రీకాంత్ చారి త్యాగాలతో కూడుకున్న విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం సంక్షేమం గురించి కార్పోరేషన్ ప్రకటించకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునర్ పరిశీలించి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏనుగుల సత్యం,జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి రమేష్,సంకోటి రమేష్, బాగోజి ఆంజనేయులు,తిప్పవరం రవీందర్, స్తంభంపల్లి రామచంద్రం,సంకోటి సత్తయ్య,అల్వాల లక్ష్మణ్,రాజు,చొప్పదండి లక్ష్మణ్,జగదీశ్వర్ చారి, మామిడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మేరా కులస్తుల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సూర్య సిరిసిల్ల టౌన్



మేర కులస్తులకు ప్రత్యేకించి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఆశిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. స్థానిక గాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్,విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మేర సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఓడెల శ్రీనివాస్, రామగిరి చంద్రయ్య, రామగిరి గణేష్ మాడిశెట్టి నరసయ్య,టెంపరవెల్లి శ్రీనివాస్,రామగిరి భాస్కర్, వెన్ను నరసయ్య, దీకొండ శేషగిరి,రాపర్తి చరణ్, రామగిరి కిషన్,పెండ్యాల బిక్షపతి,మోహన్, రాజేష్, వెన్ను ఆంజనేయులు,రామగిరి పాండు, రామగిరి వెంకటేష్, రామగిరి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు ఎంపీ నిధులు మంజూరు

సూర్య ముస్తాబాద్

పోతుగల్ గ్రామములోని ఎస్సీ మాదిగ కమ్యూనిటీ హాలు ప్రహరీ గోడకు ఎంపీ బండి సంజయ్ నిధులతో 3లక్షలు మంజూరు చేయడము జరిగింది. బీజేపీ కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు వరి వెంకటేష్,గ్రామ శాఖ అధ్యక్షులు చికోటి మహేష్ అధ్వర్యంలో 3 లక్షల చెక్కును ఎస్సీ(మహిళ )కమ్యూనిటీ సంఘ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షులు మెరుగు అంజగౌడ్, బిజెపి నాయకులు ఒరుగంటి సత్యం, బాల్రెడ్డి, వరి వెంకటేష్, నాంపల్లి,చికొటి మహేష్, కనకయ్య, మామిళ్ల బిక్షపతి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశాలీల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

సూర్య సిరిసిల్ల టౌన్

పద్మశాలీల కోసం ప్రత్యేకించి కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి హర్షిస్తూ సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పలువురు పాలాభిషేకం చేశారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పద్మశాలీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకించి పద్మశాలి కార్పొరేషన్ను ఏర్పాటు చేయడం అభినందనీయమని రానున్న రోజుల్లో పద్మశాలీల కు ఈ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం,మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య,యేళ్ళ లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ,బుజ్జి తార,డాక్టర్ బాలయ్య,సామల దాసు తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకుంటాం...

**- కేకే మహేందర్ రెడ్డి**

సూర్య సిరిసిల్ల టౌన్



గత ప్రభుత్వాల తప్పిదాల వల్లే ప్రస్తుతం సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో 280 రోజులు పని కల్పించే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. వస్త్ర పరిశ్రమ దాని అనుబంధంగా ఉన్న కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడవ రోజుకు చేరాయి. ఆసాముల దీక్షలను కేకే మహేందర్ రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రస్తుతం సిరిసిల్లలో సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని అన్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం బతుకమ్మ చీరల ఆర్డర్ ఇచ్చారే తప్ప సంవత్సరాంతం ఉపాధి కల్పించలేకపోయారని అన్నారు. బతుకమ్మ చీరల పేరిట కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. సిరిసిల్ల ప్రాంత కార్మికులను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని ఈ మేరకు 280 రోజులు కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేస్తున్నాయి. రానున్న 20 రోజుల్లో కచ్చితంగా ఉపాధి కల్పిస్తామని కార్మికులకు కేకే మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

**-అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్**

సూర్య రాజన్న సిరిసిల్ల.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. జాతీయ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సిరిసిల్ల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. డబ్బులు చెల్లించి వస్తువులను కొనుగోలు చేసినా, సేవలను పొందినా అందరూ వినియోగదారులేనని, ఆన్లైన్, ఆఫ్లైన్ , మల్టీలెవెల్ మార్కెటింగ్ తదితర విధానాల ద్వారా వస్తువులు కొనుగోలు చేసినా అందరూ వినియోగదారులేనని వి . అనంతరం సిరిసిల్ల వినియోగ దారుల సంఘం బాధ్యులు మాట్లాడారు. వినియోగ దారుల రక్షణ చట్టం -2019 అంశా లను వివరించారు. నాణ్యమైన సరుకులు పొందే హక్కు, ఎంపిక చేసుకొనే హక్కు, సమాచారం పొందే హక్కు,



ఫిర్యాదు చేసే హక్కు, నష్ట పరిహారం పొందే హక్కు లపై వివరించారు. ఈ చట్ట పరిధిలోకి బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, జీవిత బీమా సంస్థ, రైల్వే, ఎయిర్లైన్స్, ట్రాన్స్పోర్ట్ సర్వీసు, కొరియర్, విద్యుత్ సంస్థ, హౌజింగ్ బోర్డు, టెలిఫోన్ డిపార్టుమెంట్, గ్యాస్ కంపెనీలు, క్లినికల్ ల్యాబ్స్ ప్రైవేటు ఆసుపత్రులు వస్తాయని తెలిపారు. ఫిర్యాదు స్థానిక అధికారులకు నేరుగా లేదా సంఘం ద్వారా ఇవ్వ వచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ కమి షన్, రాష్ట్రస్థాయిలో రాష్ట్రకమిషన్, జాతీయ స్థాయి లో నేషనల్ కమిషన్ ఉంటాయని, రూ . కోటి లోపు కేసులను డిస్ట్రిక్ట్ కమిషన్ కు, రూ. కోటి నుండి రూ. 10 కోట్లకు వరకు రాష్ట్ర కమిషన్, రూ. 10 కోట్లపైన నేషనల్ కమిషన్ కు నేరుగా లేదా పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తూనికలు, కొలతలలో మోసాలు, నాణ్యతలేని వస్తువులు, అధిక ధరలు, కల్తీలు, బ్లాక్ మార్కెటింగ్, మోసపూరిత ప్రకటనల నుంచి రక్షించబడాలంటే వినియోగదారుల హక్కులను తెలుసు కోవాలని స్పష్టం చేశారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్లు 1800114000 లేదా 1915 అలాగే వాట్సాఫ్ నంబర్ 8800 001915, రాష్ట్ర స్థాయిలోటోల్ ఫ్రీ నంబర్లు 18004259339 లేదా 1967లో లని సూచించారు. కార్య్ర కమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, వినియోగదారుల సంఘం రాజన్న సిరిసిల్ల ప్రెసిడెంట్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**సూర్య ధర్మపురి**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014 లో ధర్మపురి మండలం గాదేపల్లి శివారులోని ప్రభుత్వ భూమిని 100 మంది నిరుపేదలకు పంపిణీ చేశారు. అట్టి భూమికి సంబంధించిన హద్దులు చూపించలేక పోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మణ్ కుమార్ ఎన్నికల్లో గెలిచిన అనంతరం అట్టి 100 మంది లబ్ధదారులకు హద్దు పత్రాలను పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం భూములకు సంబంధించిన అర్హులైన 84 మందికి గురువారం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హద్దులకు సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన భూములకు సంబంధించిన హద్దులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోకా చూపించక పోవడంతో అక్కడి పేద ప్రజలు అట్టి భూమిని సాగు చేసుకోక చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని



అన్నారు. తాను ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అట్టి భూములకు సంబంధించి హద్దు పత్రాలను ఈ రోజు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పత్రాలను అందుకున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. మిగిలిన వారికి సంబంధించి హద్దు పత్రాలను త్వరలోనే పంపిణీ చేస్తామని, కోర్టులో ఉండటం వల్ల వారివి కాస్త ఆలస్యం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఇచ్చిన హామీలలో భాగంగా 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను అమలు చేయడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా, విప్ గా, మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ఇట్టి హద్దులు చూపించి పేద వారికి చెందవలసిన భూమిని వారికి ఇప్పించాలన్న ఆలోచన కూడ చెయ్యలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చైతన్య, నాయకులు కుంట సుధాకర్, చిలుముల లక్ష్మణ్, జక్కు రవీందర్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో వివిధరకాల చేపల పెంపకం జరిపేలా దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



జిల్లాలో వైవిధ్యమైన వివిధ రకాల చేపల పెంపకం జరిగేలా అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు .గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రధాన మంత్రి మత్స్య సంపదయోజన పథకం పై నిర్వహించిన డి.ఎల్.సి సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా జిల్లాలో 2023-24 సంవత్సరానికి రూపాయలు 7లక్షల యూనిట్ వ్యయంతో నూతంగా చెరువుల కొరకు ఇద్దరు, రూపాయలు 3 లక్షల యూనిట్ వ్యయంతో ఆటోరిక్షాల కొరకు ముగ్గురు దరఖాస్తులను సమర్పించిగ వారిని అర్హులుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. పి.యం.యం.ఎస్.వై. పథకం ద్వారా 2020-21, 2021-22 లలో అందించిన 12 రకాల కాంపోనెంట్స్ వివరాలను, యూనిట్ వ్యయం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందిస్తున్న సబ్సిడి, లబ్దిదారునికి చేకురుతున్న లాభం తదితర విషయాలను గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు, జిల్లాలో మంజూరై ప్రస్తుతం నిర్వహించబడుచున్న యూనిట్లను పరిశీలిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా పథకం ద్వారా చేకురే లాభాలు, ఆదాయ మార్గాలు, నష్ట నివారణా చర్యలను గురించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు నిర్వహణలో అవసరమైన మెలకువలను, సహకారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ శ్రీనివాస్ రెడ్డి, డిఎఫ్ఓ దేవేందర్, ట్రెడిషనల్ ఫిషర్ మెన్ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

**సూర్య - సుల్తానాబాద్**

పట్టణాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రామారావు అన్నారు. 2 కోట్ల 70 లక్షల రూపాయల డియంఎఫ్టి నిధులతో సుల్తానాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి గట్టేపల్లి రోడ్డు వరకు ఫోర్ లైన్ సెంట్రల్ లైటింగ్ పనుల నిర్మాణం, పట్టణ ప్రగతిలో భాగంగా 25 లక్షల రూపాయల నిధులతో పట్టణంలోని 2,3 వ వార్డులలో మురికి కాలువలు, సీసీ రోడ్ నిర్మాణలకు సంబంధించిన అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే విజయ రమణారావు శంఖుస్థాపనలు చేసారు. అలాగే 83 లక్షల రూపాయల నిధులతో పట్టణంలోని కేడీసీసీ బ్యాంక్ నూతన భవన నిర్మాణం పనికి టేస్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు తో కలిసి ఎమ్మెల్యే విజయ రమణారావు శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే విజయ రమణా రావుతో పాటు టేస్కబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడు తూ గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో సుల్తానాబాద్ పాత తాలూకాపై సవతి తల్లి ప్రేమ చూపిందని, సుల్తానాబాద్ పట్టణాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, రానున్న రోజుల్లో సుల్తానాబాద్ పాత తాలూకాను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఎంపిపి బాలాజీ రావు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమతా కృష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్ అనుమల అరుణ బాబురావు, కూకట్ల గోపి, దున్నపోతుల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు సాయిరి మహేందర్, మినుపాల ప్రకాష్ రావు, వేగలం అబ్బాయ్యా గౌడ్, దాన్నాయక్ దామోదర్ రావు, చిలుక సతీష్, కుమార్ కిషోర్, శివాలయం డైరెక్టర్ గూడెం లింగమూర్తిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# కత్తిపోటుకు గురైన నర్సయ్యచికిత్స పొందుతూ మృతి

**సూర్య మల్యాల**



మల్యాల మండలం తక్కల్లపల్లి గ్రామంలో ఈనెల 4న పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన మహేష్ అనే యువకుడు తక్కలపల్లిగ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని యువతీ ఇంటికి వచ్చి హత్యకు గురైన విషయం విధితమే. ఈ హత్య ఘటనలో యువతి తాత ఆనందాస్ నర్సయ్య 55 అనే వృద్ధుడు కత్తిపోట్లకు గురై హైదరాబాదులో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కాగా ప్రేమ పేరుతో మహేష్ అదే రోజు హత్యకు గురి కాగా 11 రోజులఅనంతరం ఆస్పత్రిలో యువతి తాత చికిత్స పొందుతూ మృతి చెందడం గ్రామంలో విషాదం నెలకొంది. యువతి తండ్రి ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్ళాడు. వృద్ధుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# జిల్లాకు చేరుకున్న కేంద్ర సాయుధ బలగాలు

**- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బందికి సహాయంగా సిఐఎస్ఎఫ్ కంపెనీ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు జిల్లాకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర బలగాల అధికారులు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. కేంద్రం సాయుధ బలగాలు ను క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లలో, రూట్ బందోబస్త్, స్ట్రాంగ్ రూమ్, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని ఉంచడం జరుగుతుంది అన్నారు. లోకల్ పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి గొడవ లేకుండా



ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి అధికారి కృషి చేసి ఎన్నికల విజయవంతం చేయాలని అన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు భద్రత భావాన్ని కలిగించాలని అన్నారు. ఎన్నికల, సదుపాయాల పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న అధికారులకు తెలిపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పి జిల్లాలో ఉన్న పోలింగ్ స్టేషన్ వివరాలు, చెక్ పోస్ట్ లు, జిల్లా యొక్క భౌగోళిక పరిస్థితుల గురించి కేంద్ర బలగాల అధికారులకు వివరించారు. ఈ సమావేశం లో ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ AR భీమ్ రావు, సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సతీష్ కుమార్, ఇన్స్పెక్టర్ సచిన్ పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ ఆండాళ్ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

తిమ్మాపూర్ మండలం మహాత్మ నగర్ (ఎల్ఎండికాలనీ)లో శ్రీ ఆండాళ్ పద్మా వతి సమేత వెంకటేశ్వర స్వామి వారి 45వ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురు వారం స్వామీ కళ్యాణోత్సవం అర్చకులు గోవర్ధన వెంకటాచర్యులు, గోవర్ధన శ్రీకాంతాచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరిగింది. శ్రీ గిరిజ మృత్యుంజయశ్వర స్వామి వారి ఆలయ తరపు నుండి ఆలయ కమిటీ పెద్దలు శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలు తలంబ్రాలతో యుక్తముగా సమర్పించడం అయినది. కళ్యాణో త్సవంలో పూర్వరంగముగా ఎదుర్కోలు ఉత్సవం జరిగినది. సామూ హిక తిరుప్పావై సేవా కాలం, ఆ తదు పరి ప్రభావితకి ఆరగింపు... సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం. ఆ తదుపరి యాగశాలలో నిత్య హెూమము, నిత్య పూర్ణాహుతి కార్య క్రమం ముగించుకొని ఉభయ దేవరులతో కూడినటువంటి వెంకటేశ్వర స్వామి వారిని మం గళ వాయిద్యాలు తోటి కళ్యాణ మండ పానికి తీసుకు రావడం జరిగినది. ఇట్టి కళ్యాణ ఉత్సవంలో విశ్వక్సేనారాధన వాసుదేవ పుణ్యా హవా చనము ఆ తదుపరి స్వామివారికి అమ్మవారిలకు రక్షా బంధన్ ధారణ... ఆ తదుపరి స్వామి వారికి నూతన యజ్ఞోప వీత ధారణ... అయిన తదుపరి జీలకర్ర బెల్లము ధారణ గావించడం జరిగింది. ఆ తదుపరి వేద గోష నుడు మంగళ వాయిద్యాలు నడుమ భక్తుల యొక్క కరతాళ ధ్వనుల నడుమ స్వామివారి తరఫునుండి అమ్మ వారికి మాంగల్య దారుణ జరిపిం చడం జరిగింది. ముత్యాల తలంబ్రాలు చేత స్వామికి అమ్మవార్లకు అక్షత రూపన కార్యక్రమం జరిపించడం అయినది. కళ్యాణం అనంతరం వచ్చినటు వంటి మహిళా భక్తులు అమ్మవార్లకు ఒడు బియ్యం సమర్పించడమైనది. ఆ తదుపరి భక్తులకు



అందరికీ కూడా ఆశీర్వచనం కార్యక్రమం జరిగినది. ఆ తదుపరి వెంటనే సామూహిక అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కూడా జరిగి నది. ఇట్టి కార్యక్ర మంలో భక్తులు మండల ప్రాంతం నుండి కాకుండా జిల్లా ప్రాంతం నలు మూలల నుండి కూడా విచ్చేసి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మారం జగదీశ్వర్, మామిడి రమేష్, లక్ష్మణ్ రావు, పోలు కిషన్, రాగి శ్రీనివాస్, బట్టు కర్ణాకర్, రవీందర్ రెడ్డి,భక్తులు పాల్గొన్నారు.





# బాధితులు కావొద్దు..ఫిర్యాదుతో పరిష్కారం..!

**- నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం**

**సూర్య జగిత్యాల**



భాదితులు కావొద్దు ఫిర్యాదుతో పరిష్కారం ఉంటుంది. అందు కోసమే కేంద్రప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టం రూపొందించింది. ఏ రూపం లో నైనా వస్తువులు,సేవల నుంచి రక్షణ కల్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నేపథ్యంలో ప్రజలకు రక్షణ కల్పించే ఈ చట్టం గురించి అవగాహన కోసం ప్రత్యేక కథనం...ప్రజలు మోసపోకుండా అండగా ఉండేదుకు మన దేశంలో కేంద్రప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టం 2019 ని పకడ్బందీగా ప్రవేశ పెట్టింది. అయితే కరోనా కారణంగా ఈ చట్టంపై అంతగా చైతన్య కార్యక్రమాలు జరుగలేదు.ఇటీవల కాలంలో ఎక్కువగా సేవా లోపాలపై వినియోగదారులు కమిషన్ ను ఆశ్రయిస్తున్నారు.వైద్యములో వ్యాపార, భీమా రంగాల్లో ,కల్తీ,పైనే ఎక్కువగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా కరీంనగర్ కేంద్రంలోనే ఉన్న వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ లో జగిత్యాల, సిరిసిల్ల,పెద్దపల్లి,కరీంనగర్ జిల్లాల ప్రజలు ఫిర్యాదులు చేసుకునే వీలుంది. జగిత్యాల జిల్లాలో సైతం ఏర్పాటు చేసినట్లయితే,వ్యయ ,ప్రయాసలు ప్రజలకు తప్పుతాయని ప్రజా భాంధవి వినియోగ దారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తమ సంఘం ఆధ్వర్యంలో తరుచుగా జిల్లా, డివిజన్,మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

**ఇలా కమిషన్ ను వినియోగదారులు సంప్రదించాలి.**

కమిషన్ కు నేరుగా ఫోన్ లో ఫిర్యాదు చేసే వీలు లేదు.కమిషన్ కార్యాలయంలో వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. సంబంధి ంచిన రశీదు, ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేస్తేనే న్యాయం జరుగుతుంది.దేశ వ్యాప్తంగా అందు బాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్. 1800 4250 0333 కి ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకునే వీలుంది.

**కమిషన్ పరిధి ఎంత వరకంటే**

వినియోగదారుల ఆన్ లైన్ లావాదేవీలు, ఎలక్ట్రానిక్ మార్గాలు, టెలి షాపింగ్,ప్రత్యక్ష అమ్మకాలు, బహుళ స్థాయి మార్కెటింగ్ ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి వినియోగదారుల చట్టం ప్రకారం వారి వివాదాలను పరిష్కరిస్తుంది.జిల్లా స్థాయిలో రూ.కోటి విలువ వరకు ఉన్న వివాదాలను పరిష్కరిస్తుంది.ఆ పై విలువ ఉన్నవి రాష్ట్ర,జాతీయ కమీషన్ల వద్ద పరిష్కరించుకోవాలి.

**భాదితులు కావొద్దు..నిగ్గదీసి అడగొచ్చు..!**

**హరి అశోక్ కుమార్, న్యాయవాది,జిల్లా అధ్యక్షులు,ప్రజా భాంధవి వినియోగదారుల సంఘం.జగిత్యాల జిల్లా.**

వస్తువులను కొనుగోలు చేసే ముందు నాణ్యత పరిశీలించాలి. కొనుగోలుకు సంబంధించి రశీదు విధిగా పొందాలి.నాసి రకం, నకిలీ వస్తువులు, మోసపూరిత ప్రకటనలతో మోసానికి గురైతే ఎలాంటి భయం లేకుండా కమిషన్ లో ఫిర్యాదు చేయాలి.తద్వారా తగిన నష్ట పరిహారం అందే వీలుంది. తరుచుగా మా సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.జగిత్యాల జిల్లా కేంద్రంలో వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేయాలని మా సంఘం తరపున జిల్లా ఏర్పాటు నుంచి ప్రభుత్వంను కోరుతున్నాం .ఈ విషయంలో రాష్ట్ర పౌర సరఫరా మంత్రికి వినతిపత్రం సమర్పించాం.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనుహ్యస్పందన

**సూర్య చిగురుమామిడి....**



చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి గ్రామస్తుల నుండి అనూహ్య స్పందన లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అలకాపురి అధ్యక్షుడు కాంతాల రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు దేవసాని కిరణ్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని పురుషుల పొదుపు సంఘంలో పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ నేత్ర వైద్య శిబిరానికి నవాబుపేట గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజల సైతం పాల్గొని దాదాపు రెండు వందల మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియల్ ప్రభాకర్ రావు కంటి పరీక్షలను నిర్వహించి కంటి ఆపరేషన్ అవసరం ఉన్న దాదాపు 45మందిని ఆస్పత్రి బస్సులో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. గ్రామ ప్రజల కోసం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కాంతాల రాజిరెడ్డి,ఉపాధ్యక్షులు దేవసాని కిరణ్ కుమార్ రెడ్డిలకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కంది వేణు,మాజీ సర్పంచ్ సుద్దాల ప్రవీణ్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ మాకు శ్రీనివాస్ రెడ్డి,రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూతురు సంపత్ రెడ్డి,కాంతాల అజేందర్ రెడ్డి,పోతరవేణి రాజయ్య, పొదుపు సంఘం ఘనకుడు గుర్రాల శ్రీనివాస్ రెడ్డి,ఆర్.ఎం.పి వైద్యుడు కిషన్,గుల్ల రాజు,ఒదయ్య యాదవ్,మంద వెంకన్న, పాల్గొన్నారు.

## కేంద్రం నిధులతో అభివృద్ధి పనులు

**సూర్య, హుజురాబాద్**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి పనులు ఎంపీ బండి సంజయ్ చేశారని హుజురాబాద్ బిజెపి పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు అన్నారు. గురువారం హుజురాబాద్ లో ఆయన మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ తన నిధులతో హుజురాబాద్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశారని అన్నారు. గాంధీనగర్ లో నీటి వసతి కోసం రెండు లక్షల రూపాయలు మంజూరు చేశారని, కరీంనగర్ సైనిక్ స్కూల్, శాతవాహన యూనివర్సిటీ కి 12 - బి హోదా, జగిత్యాల - వరంగల్, ఎల్కతుర్తి - సిద్దిపేట ల మధ్య రోడ్లు, ఆర్ఓబి బ్రిడ్జి, ఎస్ఆర్ఆర్ కాలేజీ కి అటనామస్ గుర్తింపు, జమ్మికుంట రైల్వే స్టేషన్ లో రెండు ఎక్స్ ప్రెస్ ట్రైన్ లకు స్టాప్ ఇవ్వడం లాంటి అనేక పనులు చేశారని అన్నారు. కావాలనే కొంత మంది కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు నల్ల సుమన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగిశెట్టి ప్రభాకర్, శశిధర్, అంకతి వాసు, తిప్పబత్తిని రాజు, బొరగాల సారయ్య తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలకు ఎంపీ బండికి ఆహ్వానం

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి పట్టణంలో ఈ నెల 17 నుండి 20 వరకు నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవానికి హాజరుకావాలని చొప్పదండి గౌడ యువజన సభ్యులు బుధవారం కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను కలిసి పట్నాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్బంగా రేణుకా ఎల్లమ్మ పట్నాల విశిష్టత, పవిత్రత ను బండికి వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సభ్యులు బత్తిని ప్రశాంత్ గౌడ్, పూదరి మధు గౌడ్, బొడిగె గంగరాజు గౌడ్, బోడిగే సాయి కృష్ణ గౌడ్, కట్ల ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు 10 జిపిఏ సాధించాలి

**- డిఈఓ**

**సూర్య, వీణవంక**



రాబోవు పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని జిల్లా విద్యాధికారి సిహెచ్ వివిఎస్ జనార్ధన్ రావు పేర్కొన్నారు. వీణవంక మండల కేంద్రంలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో గురువారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. అనంతరం డిఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మంచి మార్కులు సాధించి కన్న తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా మంజూరు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను డిఈఓ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కృపారాణి, పాఠశాల ప్రత్యేక అధికారి లావణ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్యులు

**సూర్య, వీణవంక**

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించడంతో వీణవంక మండల నాయకులు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని విధాలుగా ఎదగాలని, పేద, మధ్య తరగతి ఆర్యవైశ్యులు సమాజంలో ఎదిగి గౌరవప్రదంగా నిలవాలనే ఆశయంతో సీఎం వైశ్య కార్పొరేషన్ ప్రకటించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామిడి శ్రీధర్, శేఖర్, గిరిబాబు, పల్లెర్ల కిరణ్, తాటికెల్లి రవీందర్, అయితే జన్నయ్య, డాక్టర్ రమేష్, నాగమల్లి దయాకర్, బాపన్న, కోటేశ్వర్, తాటిపల్లి శ్రీనివాస్, అజయ్, మురళి, వెంకట్, నారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుడు సురేందర్ రెడ్డి కి ప్రణవ్ పరామర్శ

**- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ప్రణవ్ సూచన**

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సంది సురేందర్ రెడ్డి అనారోగ్యంతో కరీంనగర్ మీనాక్షి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రణవ్ వెంట వీణవంక మండల కాంగ్రెస్ నాయకులు రఘుపాల్ రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, సతీష్, నల్ల కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి, జగన్ రెడ్డి, కామిడి శ్రీపతి రెడ్డి తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

## కౌశిక్ రెడ్డి వీరాభిమాని కాంగ్రెస్ లో చేరిక

**సూర్య, వీణవంక**



కరీంనగర్‌లో గురువారం హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వీరాభిమాని బండారి అనిల్ టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు అనిల్ కి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరుతున్నట్లు అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి, పత్తి సమ్మిరెడ్డి, సదాశివరెడ్డి, సతీష్, నాయకులు పల్లెర్ల కిరణ్‌లు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు కుర్నాల రాజేష్, జంగ వంశీ, లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**సూర్య, హుజురాబాద్**

రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టు కుటుంబాలకు ఈనెల 17వ తేదీ ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు ఉస్మాన్ పాషా, కార్యదర్శి విష్ణుదాస్ గోపాలరావు, ప్రచార కార్యదర్శి గంజి జయవర్ధన్ లు తెలిపారు. హైదరాబాద్ పట్టణానికి చెందిన మేడి విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు హుజురాబాద్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఉచితంగా నేత్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని హుజురాబాద్ డివిజన్ పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టుల కుటుంబాలు వినియోగించుకోవాలని కోరారు.

## ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు అర్హులైన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఆర్టీసీ కరీంనగర్ రీజియన్లో మెడికల్ అన్ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు ఉపాధికల్పన, ఉద్యోగంలో వుండి మరణించిన వారి పిల్లలకు కారుణ్య నియామకాలు కల్పించు కార్యక్రమములో భాగంగా గురువారం రోజున డా. బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్ కరీంనగర్లోని సమావేశ మందిరములో అర్హులైన 71 మందిలో నుండి హాజరైన 64 మందికి కండక్టర్ ఉద్యోగము కల్పించుటకు గాను సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, హైట్కు వారి కుటుంబ సభ్యుల సమక్షములో సెలక్షన్ కమిటీ సభ్యులు, సెక్యూరిటీ సిబ్బంది పరిశీలించారు.ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ ఎన్. సుచరిత మాట్లాడుతూ చాలాకాలం తరువాత ప్రభుత్వం కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించిందని, కావున ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగము చేసుకోవాలన్నారు.ఈ సెలెక్షన్ కమిటీలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ ( ఆపరేషన్స్ ) ఎస్. భూపతి రెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ ( మెకానికల్ ) కె. సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎం. చంద్రయ్య సభ్యులుగా వున్నారు.

# ఉమెన్ సాధకుల అవార్డు గ్రహీతలుగా జగిత్యాల జిల్లా నారీమణులు

**సూర్య జగిత్యాల ప్రతినిధి: 04**

ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా ఉమెన్ సాధకుల అవార్డులను గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్, జెడి ,అర్ జె డి ల ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు అవార్డులను అందజేసి సన్మానించినారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా నుండి ఉమెన్ సాధకుల అవార్డులను డి డబ్ల్యు ఓ వాణిశ్రీ ,మల్యాల మండలం సూపర్వైజర్ పవిత్ర, జగిత్యాల ప్రాజెక్ట్ అంగన్వాడి టీచర్ వి. వనిత , మెట్పల్లి ప్రాజెక్ట్ అంగన్వాడి టీచర్ రాజ్యలక్ష్మి లకు రాష్ట్రస్థాయిలో అవార్డు గ్రహీతలుగా అవార్డులను అందించారు . ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే పురస్కరించుకొని ఉమెన్ సాధకుల అవార్డును పొందడం ఎంతో సంతోషకరంగా ఉందని పేర్కొన్నారు ఈ ఆవార్డులను రాష్ట్రస్థాయి అధికారుల చేతుల మీదుగా అందుకోవడం ఎంతో ఆనందదాయకమని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు పొందిన మహిళలకు జగిత్యాల జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు.





## రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు

**సూర్య,కరీంనగర్ రూరల్**

సర్ సి.వి.రామన్ గణిత ఒలింపియాడ్ లో రాష్ట్రస్థాయి లో పారమిత విద్యార్థులు సత్తాచాటారు,ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు గురువారం ప్రత్యేకంగా అభినందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట వల సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యం లో నిర్వహించిన సర్ సి.వి .రామన్ యంగ్ జీనియస్ గణిత ఒలింపియాడ్ లో పారమిత హెరి టేజ్ పాఠ శాల 8 వ తరగతి కి చెందిన మాస్టర్ జి.ప్రేమ్ సాయి రాష్ట్ర స్థాయి లో 4వ ర్యాంక్ (జిల్లాలో 1వ ర్యాంక్), మరియు మాస్టర్.రేయాన్ అహ్మద్ (6వ తరగతి) రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ (జిల్లాలో 2వ ర్యాంక్) సాధిం చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ , సమన్వయకర్త రాము, గైడ్ టీచర్ లక్ష్మాద్రి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ లు పెన్నులు పంపిణీ

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

శర్మ నగర్ లో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బాలిక పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థినిలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థినిలు అంతా సావిత్రిబాయి పూలే ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు అభ్యసించి కీర్తి ప్రతిష్టలు పెంచుకోవాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆ మహనీయురాలు లాగా గొప్ప సంఘసంస్కర్తగా ప్రతి విద్యార్థిని తయారు కావాలని , ప్రతి విద్యార్థిని కూడా భయాలను చెందకుండా ఎగ్జామ్ వ్రాయాలని కోరారు. అంతేకాక ప్రైవేటు పాఠశాలలు చదువుతున్న విద్యార్థి విద్యార్థినిలకు ఫీజుల విషయంలో వారిపై, తల్లిదండ్రులపై ఒత్తిడి తే వద్దని , ఇంటర్మీడియట్ లాగానే హాల్ టికెట్ ను ఆన్లైన్లో ఉంచాలని సంబంధిత డిఈఓకు పత్రిక ద్వారా తెలియజేసుకుంటూ , అలా వేధించే పాఠశాలల పై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి దుప్పటపల్లి మురళి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయురాలు వి.సుస్మిత , ఎ.సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఈనెల 20న రాములోరి హుండీ లెక్కింపు

**సూర్య, ఇల్లందకుంట**

అపర భద్రాదిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం యొక్క హుండీలను దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో ఈనెల 20 న ఉదయం 9 గంటలకు లెక్కించడం జరుగుతుందని ఆలయ ఈవో కందుల సుధాకర్ ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున హుండీ లెక్కింపు నందు ఆసక్తిగల భక్తులు ఆ రోజు ఉదయం 9 గంటల లోపు డ్రెస్ కోడ్ (లుంగీ, బనియన్) తో హాజరు కాగలరని కోరుతున్నారు.

## ఘనంగా అనభేరి 76వ వర్ధంతి

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**



కామ్రేడ్ అనబెరి ప్రభాకర్ రావు 76వ వర్ధంతి తిమ్మాపూర్ మండలం పోలం పల్లి గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్య ంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్ర మంలో బోయిని తిరుపతి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం తాడిత పీడిత ప్రజల విముక్తి కొరకు చేసిన పోరాటంలో ప్రభాకర్ రావు అమరుడయ్యారనీ అన్నారు. ప్రభుత్వం ప్రభాకర్ రావు గారి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్పించి అతని విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండి పైన నిర్మించాలని... అలాగే జయంతి వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని సిపిఐ పక్షాన డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోలంపల్లి గ్రామ శాఖ కార్యదర్శి ముత్త ఏళ్ళస్వామి, మొగిలిపాలెం గ్రామ కార్యదర్శి కాంతాల తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ మర్రి కొమురయ్య, సిపిఐ సీనియర్ నాయకులు ఆవునూరి రమేష్, సకినాల సత్యం, ఉస్మాన్ పష ,గొల్లేన రాజయ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన లెంకలపల్లి శరత్

**సూర్య జమ్మికుంట**



వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జమ్మికుంట వాసవి క్లబ్ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు ఆర్యవైశ్యులు అన్ని విధాలుగా ఎదగాలని పేద మధ్యతరగతి ఆర్య వైశ్యులు సమాజంలో ఎదిగి గౌరవప్రదంగా నిలవాలనే ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైశ్య కార్పొరేషన్ ప్రకటించినందుకు వాసవి క్లబ్ అధ్యక్షులు లెంకలపెల్లి శరత్ కుమార్ వాసవి క్లబ్ కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని వారు గొప్ప క్రమశిక్షణ కలిగిన వారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.

## కాంగ్రెస్ నేతలకు పాలాభిషేకం

**సూర్య జమ్మికుంట**

రాష్ట్రంలో 16 కుల కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ ,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ ,బలహీన వర్గాలను గుర్తించినందుకు ముఖ్యమంత్రి మంత్రులకు జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కసుబోజుల వెంకన్న, పూదరి రేణుక శివకుమార్, సుంకరి రమేష్, ఎగ్గని శ్రీనివాస్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి సజ్జు, ఎండి ఇమ్రాన్, ప్రశాంత్ (సన్నీ)దొడ్డె నవీన్, మంద అశోక్ ,సూర్య, రవి, సురేష్ బం డి మల్లయ్య, పాపిరెడ్డి, సాంబయ్య, శ్యాంసుందర్ , శ్రీనివాస్ డాక్టర్ అశోక్, సైదాబాద్ శ్రీనివాస్ రాజేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మున్సిపల్ అధికారుల తనిఖీలు

**సూర్య, కోరుట్ల టౌన్**



మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు పట్టణంలోని ఐస్ క్రీం తయారీ కేంద్రాలు, ఐస్ క్రీం విక్రయ కేంద్రాలను, వాటర్ ప్లాంట్లను గురువారం తనిఖీలు చేసారు. పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పాటించని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ ఐస్ క్రీమ్ తయారీ దారులు నాణ్యత ప్రమాణాలను, పరిశుభ్రతను పాటించాలని, వాటర్ ప్లాంట్ యజమానులు ఐఎస్ఐ లైసెన్స్ ను తీసుకోవాలని, లేని యెడల తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పను లను ప్రారంభించిన ఎంపీపీ

**సూర్య -కోరుట్ల**



ఎమ్మెల్యే డా" సంజయ్ కుమార్ చొరవతో రాజ్యసభ సభ్యులు జొగిన్ పల్లి సంతోష్ కుమార్ ఎంపి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఎంపీపీ తోట నారాయణ , జడ్పిటిసి దారిశెట్టి లావణ్య రాజేష్ లు గురువారం ప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీలో బోర్ మోటర్ కు రెండు లక్షలు అదేవిధంగా జోగిని పెల్లి,చిన్న మెట్పల్లి గ్రామంలో బోరు , మోటారుకు రెండు లక్షలు మంజూరు చేయగా వీటి పనులను ప్రారం భించారు. ఈ కార్యక్రమం లో గ్రామ స్పెషల్ ఆఫీసర్ నాగమణి, మాజీ సర్పంచులు దుంపల నర్సు రాజ నరసయ్య, నూతపల్లి ముత్తయ్య, సింగిల్ విండో చైర్మన్ ఆది రెడ్డి ,బండి భూమయ్య, కార్యదర్శి నరేష్, గ్రామ శాఖ అధ్యక్షులు భాష గంగారెడ్డి ,స్వామి ,మారుతి ,శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ కట్కం రాజేష్, నాయకులు కొత్తపల్లి వెంకటేష్, పల్లికొండ నరేష్ ,తోట వెంకటేష్, సిరిపురం గంగారం, గోపి రజాక్ ,గంగారెడ్డి పాల్గొన్నారు.



## వైభవంగా బోనాల పండుగ

**సూర్య -కోరుట్ల**

మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలో బద్ది పోచమ్మ బోనాల పండుగ కార్యక్రమం గురువారం అత్యంత వైభవపేతంగా జరిగింది. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు నెత్తిన ఎత్తుకొని ఊరేగింపుగా గంగపుత్రుల గొల్లెనల్లతో డప్పు చప్పులతో పోతరాజు విన్యాసాలతో బద్ది పోచమ్మ ఆలయం వరకు వచ్చి బద్ది పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలనునైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుగ్గిల్ల ప్రియాంక ,జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ గుగ్గిల్ల సురేష్ గౌడ్,మాజీ సర్పంచ్ తుకారం, నాయకులు ముక్కర గంగాధర్, నర్సయ్య, ముక్కెర లింబాద్రి,రాజం, శ్రీనివాస్, నరేష్, శేఖర్, రఘు మహిళలు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

**సూర్య మల్లాపూర్**

మల్లాపూర్ మండల టియుడబ్ల్యూజె- ఐజెయు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ అధ్యక్షులు గుగ్గిళ్ల రాజ శేఖర్, ఉపాధ్యక్షుడు సబావత్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి నిమిష కవి రాజేష్ లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి రమేష్, కాంగ్రెస్ నాయకులు ఇప్పపెల్లి గణేష్, మొగిలి రాజేందర్, గోపిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు



## ముగిసిన ఇంటర్ పరీక్షలు

**సూర్య జగిత్యాల**

ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షలు గురువారం ముగిశాయి. ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులకు జరిగిన రసాయన శాస్త్రము, వాణిజ్య శాస్త్రం పరీక్షలో 5715 మంది విద్యార్థులకు 5620 మంది హాజరైనారు. 95 మంది విద్యార్థులు గైరాజర్ అయినారు .ఒకేషనల్ విభాగంలో 600 విద్యార్థులకు గాను 557 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. మొత్తం మీద 97.81 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిట్టింగ్ స్క్వాడ్ లు, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ, పరీక్షల కన్వీనర్ కలిసి మొత్తం 18 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# బిఆర్ఎస్ కు మాజీ మంత్రి పెద్దిరెడ్డి షాక్

## - గుర్తింపు లేదని.... పార్టీకి రాజీనామా

**సూర్య, హుజురాబాద్**

మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి బిఆర్ఎస్ పార్టీకి షాకిచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండి రెండుసార్లు మంత్రిగా పనిచేసిన, కార్మిక సంఘ నాయకుడిగా ఉన్న ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీలో తనకు సముచితస్థానం లభించకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు అధినేత కేసిఆర్ కు లేఖ రాశారు. 2021 జులై 27న తెలంగాణ భవన్ లో కేసీఆర్ సమక్షంలో ఇనుగాల పెద్దిరెడ్డి బిజెపికి రాజీనామా చేసి బిఆర్ఎస్ లో చేరారు. తర్వాత ఉప ఎన్నికల సందర్భంగా ఇతర సందర్భాల్లో పార్టీకి సేవలను అందించారు. కాగా 2023 డిసెంబర్ లో జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఇంచార్జీ గా పనిచేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి, హుస్నాబాద్ అభ్యర్థి వి. సతీష్ బాబు గెలుపుకై విశేషంగా కృషి చేశారు. కౌశిక్ రెడ్డి విజయం కోసం హుజురాబాద్ లోనే మకాం వేసి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తిరుగుతూ నాయకులను సమన్వయం చేస్తూ పని చేశారు. ఇదే సందర్భంలో టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ హుస్నాబాద్ నియోజకవర్గానికి కూడా సమన్వయకర్తగా ఉండాలని చెప్పడంతో రెండు నియోజకవర్గాలను తిరుగుతూ పని చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన పార్టీకి దూరంగా ఉన్నారు. పలు సందర్భాల్లో పార్టీ అంతర్గత సమావేశాలకు ఆయనను పిలవకపోవడంతో దూరంగా ఉన్నారు. కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి ఎంపిక విషయంలో కూడా తనను పార్టీ పరిగణలోకి తీసుకోలేదని, తనను సంప్రదించలేదని ఆయన పార్టీపై అలకబూనారు. కొంతకాలం పాటు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల కరీంనగర్ లో జరిగిన కదన భేరి సభకు కూడా తనను ఆహ్వానించకపోవడంతో మనస్థాపానికి గురై పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆయన రాజీనామా హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో కలకలం రేపిందని చెప్పవచ్చు. రెండు నియోజకవర్గాల్లో పార్టీ నాయకులతో సత్సంబంధాలు ఉన్న పెద్దిరెడ్డి ఎన్నికల ముందు పార్టీకి దూరం కావడం వల్ల రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి నష్టం వాటిల్లుతుందేమోనని పలువురు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



### కాంగ్రెస్ అభ్యర్థిగా ఇనుగాల పెద్దిరెడ్డి....??

కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. టిఆర్ఎస్ పార్టీలో తనకు సముచిత స్థానం లభించడం లేదని మనస్థాపానికి గురై పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్న ఇనుగాల పెద్దిరెడ్డి ని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్లు ప్రచారం జరుగుతుంది. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి కి టికెట్ దాదాపు ఖరారు అయినట్లే ప్రచారం జరిగింది. కానీ ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తే బలమైన అభ్యర్థిగా పెద్దిరెడ్డి ని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తే ప్రవీణ్ రెడ్డి స్థానంలో పెద్దిరెడ్డికి టికెట్ లభించే అవకాశం ఉందని పలువురు రాజకీయ పరిశీలకులు అంటున్నారు. టిడిపిలో ఉన్న సమయంలో రేవంత్ రెడ్డికి, పెద్దిరెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ సంబంధాలతోనే పెద్దిరెడ్డి కాంగ్రెస్ పార్టీ లోకి వచ్చే అవకాశం ఉందని ఆయన అనుచరులు అంటున్నారు. హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గం కరీంనగర్ జిల్లాలో పెద్దిరెడ్డికి విస్తృత సంబంధాలు ఉండడంతో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించవచ్చు అని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తే టికెట్టు పెద్దిరెడ్డికే దక్కుతుందని పలువురు అంటున్నారు. ఏది ఏమైనా పెద్దిరెడ్డి రాజీనామా బిఆర్ఎస్ పార్టీకి కొంత మైనస్ అయ్యే అవకాశం ఉందని చెప్పవచ్చు.

### త్వరలో భవిష్యత్తు కార్యాచరణ....

టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పెద్దిరెడ్డిని " సూర్య " సంప్రదించగా పార్టీలో తనకు సరైన గుర్తింపు లేకపోవడం వల్లనే రాజీనామా చేశానని, భవిష్యత్తు కార్యాచరణ కార్యకర్తలతో చర్చించిన అనంతరం ప్రకటిస్తానని తెలిపారు.



## పురుగుల మందు డబ్బాలతో రైతుల నిరసన

**సూర్య, జగిత్యాల టౌన్**

జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ లోని జిల్లా పంచాయతీ కార్యాల యంలో గురువారం పురుగుల మందుల డబ్బాలతో రైతులు నిరసన తెలిపారు. తమ పంట పొలాల వద్ద నిర్మాణంలో ఇన్న బాయిల్డ్ రైస్ మిల్లును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లుతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతుంది అని రైస్ మిల్ వెలువడే రసాయనాలతో తమ పంటలు దెబ్బతింటాయని రైస్ మిల్ నిర్మాణాన్ని ఆపకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పొలాలు లేనప్పుడు రైతులుగా మేమెందుకు అంటూ ఆవేదనతో పురుగుల మందుల డబ్బాతో నిరసన వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ నాయకుడి రైస్ మిల్ కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన సమస్య తీరడం లేదన్నారు.

## చెగ్యాం గ్రామంలో అవగహన సదస్సు

**సూర్య, వెల్గటూర్**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష ఆదేశాల మేరకు NDRF (జాతీయ ప్రకృతి విపత్తుల ప్రతిష్పందన దళం )విశాఖపట్నం బృందం ప్రకృతి విపత్తుల నుండి ఎలా కాపాడుకోవాలని అవగహన సదస్సు నిర్వహించారు. పాము కరిచి రక్త స్రవం జరిగినప్పుడు ఇలాంటి ప్రథమ చికిత్స పాటించాలి, గుండె పోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలి, వేసవి కాలంలో వడ దెబ్బ తగిలినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో NDRF కానిస్టేబుల్ అనిల్ కుమార్ క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ ఆర్ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, ఆర్ ఐ రాజేశ్వరి, NDRF ఇన్స్పెక్టర్ రాజేందర్ కుమార్, సరోజ్, స్థానిక ఎంపిటిసి రంగు తిరుపతి, గ్రామపంచాయతీ సెక్రటరీ టి. నరేష్, గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## నీటి ఎద్దడితో చేతి పంపు రిపేరు

**సూర్య, ముత్తారం**



ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో నీటి సమస్య ఉండటంతో స్పందించినా మాజీ సర్పంచ్ మేడగోని సతీష్ అధికారుల దృష్టికి తీసుకెల్లి చేతి పంపును రిపేర్ చేపించారు. గత కొద్ది రోజుల నుండి 6, 7 వార్డులలో బోరింగ్ రిపేర్ లో ఉండగా నీటి సమస్య తీవ్రం కావడంతో బోరింగ్ మరమత్తులు చేయించారు. ఈ పనిలో మెకానిక్ అఫ్జల్, మచ్చుపేట గ్రామ సిబ్బంది కలిసి చేయడం జరిగింది.

## కాపు కార్పొరేషన్ ఏర్పాటు కాంగ్రెస్ విజయం

### - ఎంపీటీసీ కొప్పుల

**సూర్య, సెంటినరీ కాలనీ**



మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం కాంగ్రెస్ విజయమని పన్నూర్ ఎంపిటిసి కొప్పుల గణపతి పటేల్ అన్నారు. రామగిరి మండలంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రకటించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీ, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సహచర మంత్రులకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కుల సభ్యుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 15 సంవత్సరాల పోరాటం. మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ కల సాకారమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యి 100 రోజుల ముందే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కొప్పుల గణపతి పటేల్ ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలకు ఎంపీ బండికి ఆహ్వానం

**సూర్య, చొప్పదండి**

చొప్పదండి పట్టణంలో ఈ నెల 17 నుండి 20 వరకు నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవానికి హాజరుకావాలని చొప్పదండి గౌడ యువజన సభ్యులు బుధవారం కరీంన గర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను కలిసి పట్నాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్బంగా రేణుకా ఎల్లమ్మ పట్నాల విశిష్టత, పవిత్రత ను బండికి వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సభ్యులు బత్తిని ప్రశాంత్ గౌడ్, పూదరి మధు గౌడ్, బొడిగె గంగరాజు గౌడ్, బోడిగే సాయి కృష్ణ గౌడ్, కట్ల ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు.



## ధర్మపురి బ్రహ్మోత్సవాలకై లక్ష్మణ్ కుమార్ కు ఆహ్వానం

**సూర్య, ధర్మపురి**

ఈ నెల 20 నుండి ప్రారంభం కానున్న ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రావలసిందిగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆహ్వానించారు. గురువారం ధర్మపురి లోని తమ నివాసంలో లక్ష్మణ్ కుమార్ కు ఆహ్వాన పత్రికతో పాటు శేష వస్త్రం, స్వామివారి ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, సూపరింటెండెంట్ కిరణ్, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు .

## సీ ఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**సూర్య, వేములవాడ**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ప్రకటించిన సందర్బంగా వేములవాడ పట్టణ, మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సీ ఎం చిత్రప టానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం రాజన్న గుడిముందు జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ లకు పాలాభిషేకం చేసి, గుడి ముందు స్వీట్ల పంపిణి చేశారు. ఈ సందర్భగా నాయకులు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా పోరాటానికి కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు తెలిపి, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నియోజకవర్గం ఇంచార్జ్ ప్రభాకర్ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు బారాజు రమణారెడ్డి, నేరెడ్ల రాఘవరెడ్డి, గంజి జయపాల్ రెడ్డి, సంజీవరెడ్డి మల్లారెడ్డి, రాజిరెడ్డి, నాగరెడ్డి, కందిరాజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన సింగిల్ విండో చైర్మన్

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి సింగిల్విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్ రెడ్డి గురువారం కాంగ్రెస్ లో చేరారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరడం జరిగిందన్నారు. కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామన్నారు.

## ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

**సూర్య, వేములవాడ**

రాజన్న ఆలయంలో వైభవంగా నిర్వహించిన మహాశివరాత్రి జాతర విజయవంతం కృషిచేసిన ఉత్సవకమిటీ సభ్యులకు సన్మానం చేశారు. గురువారం రాజన్న ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ నందు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచారి అప్పాల భీమా శంకర్,ఏ ఈఓ లు జయకుమారి, బి.శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఈఓ సిసి ఎడ్ల శివ సాయి ఉన్నారు.

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

**సూర్య, పెద్దపల్లి**

తెలంగాణలో ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిసాయి. గత నెల 28న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమవుగా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 24 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం ప్రధమ సంవత్సర పరీక్షలు ముగియగా గురువారం రెండో సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎగ్జామ్స్ ముగియడంతో పరీక్ష కేంద్రాల నుండి బయటకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. పరీక్షలు ముగియడంతో హాస్టల్లో ఉండే విద్యార్థులు ఆనందంతో ఇంటి బాట పట్టడంతో బస్టాండ్, ప్రధాన కూడలలో రద్దీ కనిపించింది.



# విద్యార్థులకు పలు వినోదభరితమైన కార్యక్రమాలను నిర్వహించి వారిలో ఒత్తిడిని తగ్గించాలి

## - కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ - నూతన ఉత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ ఆనందోత్సవ్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రాధమిక దశ నుండే విద్యార్థులకు పలు వినోదభరితమైన కార్యక్రమాలను నిర్వహించి వారిలో ఒత్తిడిని తక్కువ చేయాలని కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ అన్నారు. వావిలాలపల్లిలోని పాఠశాల మైదానంలో వేడుకగా "ఆనందోత్సవ్" పేరుతో నిర్వహించి నటువంటి పాఠశాల వార్షికోత్సవ వేడు కలకు ముఖ్య అతిధిగా హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సడలని ఆత్మవిశ్వాసంతో ముందుకు కొనసాగి ఘన విజయాల వైపు పయనించి సమాజానికి తగిన గుర్తింపు తేవాలని చెప్పారు. నేడు చాలా మంది విద్యార్థులు ప్రణాళిక లేకపోవడం వలన మరియు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయి విజయాలని సాధించలేకపోతున్నారని గుర్తు చేశారు. తరగతి గదుల్లో భోదించిన విషయాలను చక్కగా ఎప్పటికప్పుడు సాధన చేసి విశ్లేషించి చాలా గొప్పగా విజయాలను నమోదు చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరు గురువులు భోదించిన విషయాలను సాధన చేసి వాటిలో పట్టు సాధించి ఆదర్శంగా ఉండాలని చెప్పారు.కరీంనగర్ జిల్లాను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలబెడుతున్న నరేందర్ రెడ్డికి ప్రత్యేకమైన అభినందన తెలియజేస్తు భవిష్యత్లో మరిన్ని శాఖలను ప్రారంభించి విద్యారంగ అభివృద్ధికై కృషి చేస్తు ఇతరులకు ఆదర్శప్రాయులుగా ఉంటారని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని కొనియాడారు.అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను మాత్రమే సాధన చేయకుండా



సమాజంలో వెలువడుతున్న పలు మార్పులను, చోటు చేసుకునట్టువంటి సంచలనాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తల్లి దండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా చాలా చక్కటి ప్రణాళికలతో ముందంజలో ఉండాలని చెప్పారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి "శంభో హర శంభో", "జై సియరామ్ జై సియరామ్", "కేంతా, బలగం నృత్యాలు" చాలా ఆకర్షించాయి. విద్యార్థులు చేపట్టినటువంటి లవ్ విత్ ఫన్ నాటిక ఆలోచి ంపచేసింది. వార్షిక ప్రణాళికల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించినటువంటి పలు పోటీలలో గెలుపొందిన వారికి అతిధుల చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యా యులు, శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# నిధుల మంజూరు

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ నిధుల నుండి రూ.31 లక్షలు నిధులు మంజూరు కాగా బిజెపి మండలాధ్యక్షుడు ప్రొసీడింగ్ పత్రాలను ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. మరిమడ్ల లో సీసీ రోడ్స్ కు రూ. 12లక్షలు, కొలనురులో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.12 లక్షలు, నాగారంలో ఎరువుల గోదాం నిర్మాణానికి రూ.5లక్షలు, ధర్మారం గ్రామంలో ఎరువుల గోదాం నిర్మాణానికి రూ.3 లక్షల ఎంపీ బండి సంజయ్ నిధులు మంజూరు చేసినట్లు బిజెపి జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల్కర్ బాలాజీ,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల రవి, ఎంపీటీసీ ప్రవీణ్, పాక్స్ డైరెక్టర్ ఇప్ప రాములు, మోత్కు మోహన్ ,పరశురాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ లంబాడ కార్పొరేషన్ ఏర్పాటు పై హర్షం

### - ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను సన్మానించిన గిరిజన నాయకులు

**సూర్య కోనరావుపేట**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఏర్పాటు చేసిన కార్పోరేషన్ల లో గిరిజనులకు ప్రత్యేక కార్పొరేషన్ సేవాలాల్ మహారాజ్ లంబాడ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సంద ర్భంగా గురువారం కోనరా వుపేట మండల గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను మండల గిరిజన నాయకులు, మహిళలు ఘనంగా సన్మానించారు. సేవాలాల్ మహారాజ్ లంబాడ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి,మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష

### -బోయినిపెల్లి వినోద్ కుమార్ గారిని భారీ మెజారిటీ తో గెలిపిద్దాం

## - బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జీవన్ గౌడ్

**సూర్య కోనరావుపేట**

తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు ముష్ణం జీవన్ గౌడ్ అన్నారు.గురువారం కోనరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు జీవన్ గౌడ్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని, ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధనలో, తెలంగాణ జాతిపిత, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ తో కలిసి ముఖ్య పాత్ర పోషించిన మేధావి, ఉద్యమ సమయంలో పార్లమెంటు సభ్యునిగా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను, తన గొంతుక తో యావత్ భారతదేశానికి తెలియజేసిన గొప్ప వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందని పేర్కొన్నారు. ఎంపీ బండి సంజయ్ వారాలు, తిథులు నక్షత్రాలు తప్పితే పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్దాల హామీలతో ప్రభుత్వం ఏర్పాటు చేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ, పంటలతో సుభిక్షంగా కలకలలాడుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని... కరువు ప్రాంతంగా, పాముకాట్లతో, కరెంటు కష్టాలతో, రైతు ఆత్మహత్యలకు కారణం అవుతున్నది.మరోసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీ లు తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను తెలంగాణ వాదాన్ని పూర్తిగా మాయం చేసి మోసపూరిత కుట్రలతో విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మనం ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గడప గడప కు ప్రజలకు తెలియజేసే సమయం ఆసన్నమయిందని, బోయినపల్లి వినోద్ కుమార్ ఎంపీగా గెలిపించుకొని పార్లమెంట్ లో మన తెలంగాణ గొంతుక ఆస్థిత్వాన్ని కాపాడుకోవలసిన అవసరం వున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగసాని రమణారెడ్డి, నియోజకవర్గ నాయకులు చక్రాల వేణు, మండల అధ్యక్షులు శివతేజరావు,కోరేపు చంద్రకాంత్, బొల్లు రాకేష్ యాదవ్, గాజుల వినయ్, శ్రీపాల్ రెడ్డి, నీరజ్ పాల్గొన్నారు.





# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య కోనరావుపేట**

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం కోనరావుపేట మండలం కొలనూర్ బావుసాయిపేట,వెంకట్రావుపేట కొండాపూర్,మరిమడ్ల, నిమ్మపల్లి, నాగారం పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల సంక్షేమం కొరకు కొన్ని గ్యారెంటీ పథకాలను అమలు చేశామన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాల్లో ఉన్న 16 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. వెనుకబడిన కులాల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని బ్రిడ్జిలు లింకు రోడ్ల పనులను త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొలనూర్ పాఠశాలలో జరిగిన ఫేర్వెల్ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్ ప్యాడ్స్, పెన్నులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, ఎంపిటిసి పల్లె మంజుల రవీందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెపూరి గంగాధర్,కార్యదర్శులు తాళ్ళపల్లి ప్రభాకర్,గొట్టే రుక్మిణి, పుల్కం మల్లేశం,వెంగలి వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలతో రైతుల ఆర్థికాభివృద్ధి

## - మరిమడ్లలో ఎరువుల గోదాం ప్రారంభం

## - న్యాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు

**సూర్య కోనరావుపేట**

సహకార సంఘాలు రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాయని న్యాప్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. గురువారం కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో కోనరావుపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్మించిన ఎరువుల గోదామును ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,జడ్పీ చైర్మన్ అరుణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... సహకార సంఘాలు చిరస్థాయిలో నిలుస్తాయని, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునం దిస్తాయని అన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి బాటలు వేయాలి.కేడీసీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ లు షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మిస్తున్నారు. సింగిల్ విండో లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించామన్నారు. అనంతరం జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.... గత ప్రభుత్వ హాయాంలో గ్రామా లు అభివృద్ధి చెందాయని,రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం కృషీ చేసిందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు, నాయకులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, కొలనూర్ ప్యాక్స్ ఛైర్మన్ రామ్మోహన్ రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, డీసీవో బుద్ధనాయుడు,కెడిసిసి బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్, పాక్స్ వైస్ చైర్మన్ లు భూమిరెడ్డి, మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల దేవయ్య,ఎంపీటీసీ రేణుక, నాయకులు రాఘవరెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



# మల్చింగ్,డ్రిప్ ఆధునిక పద్ధతులతో కూరగాయలు సాగుతో అధిక లాభాలు పొందవచ్చు

**- ఆదర్శ రైతు మెండె మల్లేశం**

**సూర్య, జూలపల్లి**

రైతులు కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జూలపల్లి మండల కేంద్రానికి చెందిన రైతు మెండె మల్లేశం అన్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన రైతు మెండె మల్లేశం సాగు చేస్తున్న కూరగాయల పంటలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించి జిల్లా రైతులు ఆధునిక పద్ధతులతో కూరగాయల సాగుతో లాభాలు ఎలా పొందాలో తెలుసుకునుటకు మల్లేశం సాగు చేస్తున్న పద్ధతులను క్షేత్రస్థాయిలో రైతులకు చూపించి ప్రోత్సహించవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డికి సూచించగా గురువారం పెద్దపల్లి మండల రైతులు వ్యవసాయ అధికారులు క్షేత్ర సందర్శన చేశారు.మెండె మల్లేశం కూరగాయల సాగు 25 సంవత్సరాలుగా చేస్తున్న ట్లు సంప్రదాయ పంటల సాగు లాభసాటిగా లేక పోవడంతో కూరగాయల సాగుపై దృష్టి సారించి



మల్చింగ్, డ్రిప్ విధానంతో తక్కువ నీటితో, ఖర్చులు తగ్గించుకుని లాభసాటి వ్యవసాయం చేస్తున్నానని. పది ఎకరాల్లో డ్రిప్ ఏర్పాటు చేసి పందిరి సాగుపై దృష్టి సారించి దొండ కాయ,బీరకాయ, కాకరకాయ, టమాట, వంకాయ, కాలీఫ్లవర్, సొరకాయ, బెండ వంటి పంటలను సాగు చేస్తూ వస్తున్నానని రైతులకు వివరించారు. వివిధ రకాల కూరగాయల సాగుతో డిమాండ్ ఉన్న పంటల వల్ల లాభాలు వస్తాయని తెలిపారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన పెద్దపల్లి మండల రైతులు తమకున్న అనుమానాలను,ఏ పంటలను ఎప్పుడు నాటాలి డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది, పంటలను చీడపీడలు,తెగుళ్లను ఎలా అధిగమించాలి,తదితర విషయాలను రైతు మల్లేశం ద్వారా తెలుసుకున్నారు. కూరగాయల సాగు క్షేత్ర సందర్శన వల్ల రైతులకు సాంప్రదాయ పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జూలపల్లి, పెద్దపల్లి వ్యవసాయాధికారిణి ప్రత్యూష,అలివేణి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతు మెండె మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం డ్రిప్, మల్చింగ్ షీట్స్ కోసం, పందిర్లు వేయడానికి సబ్సిడీలు ప్రోత్సాహకాలు అందించాలని. విత్తనాలను ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే ఏర్పాటు చేస్తే రైతులు కూరగాయల సాగుకు ముందుకు వస్తారని తెలిపారు.ఈ క్షేత్ర సందర్శన కార్యక్రమంలో పెద్దపల్లి మండలం రైతులతో పాటు జూలపల్లి మండల ఏఈఓలు రాకేష్, శ్రీవాణి, కిరణ్మయి, పెద్దపల్లి ఏఈఓలు వినయ్,శిరీష,శ్వేత, కల్పన,సువర్చల,స్పందన లు పాల్గొన్నారు.

## కన్నుల పండుగ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం.



**సూర్య, రాయికల్**

రాయికల్ మండలంలోని భూపతిపూర్ లో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది.శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా వినాయక ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు నిర్వహించి, లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య, మేల తాళాల నడుమ,భక్తుల భగవాన్ నామస్మరణ మధ్య వైభవంగా లక్ష్మి నరసింహ స్వామీ కళ్యాణ మహోత్సవం జరిగింది. కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ మహోత్సవాలను చుట్టుపక్కల గ్రామాలు మూట పెల్లి,వద్దే లింగాపూర్,రాయికల్, రామాజీపేట్, చింతలూరు గ్రామాల నుండి భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంకోజీ మహేష్,తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్ర శేఖర్, వైస్ ఎంపిపి యాచమనేని మహేశ్వర్ రావు,సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ అన్నవేని వేణు,అర్చకులు కాకుస్తం వెంకట కృష్ణ,వెంకట రమణ,నాయకులు మహేందర్ గౌడ్,లక్ష్మీనారాయణ,శేఖర్ రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు,యువజన,కుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశానంలో ఐమాక్స్ లైట్, బోరు ప్రారంభం

**సూర్య,రాయికల్**



రాయికల్ సామూహిక స్మశాన వాటిక లో ఐమాక్స్ లైట్,బోరు మోటార్ కు ఎమ్మెల్సీ టీ.జీవన్ రెడ్డి నిధులు మంజూరు చేయగా,గురు వారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు,కౌన్సిలర్లతో కలిసి ప్రారంభం చేశారు.గత అనేక సంవత్సరాలుగా శవాలు ఖననం చేయాలంటే రాత్రి వేళలో సెల్ ఫోన్ లైట్స్ తో చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని,ప్రజలు అనేకసార్లు లైటు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడం తో,అలాగే స్మశాన వాటికలో నీటి సౌకర్యం కొరతతో అనేకసార్లు వాటర్ ట్యాంకులు వినియోగించాల్సిన దుస్థితి నెలకొనడం తో, పరిస్థితిని గ్రహించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తమ నిధుల నుండి బోర్ మోటార్,హైమస్ లైట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అరటి పనులను ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో అభివృద్ధి పనుల్లో అందరూ పాలు పంచుకోవాలని,అలాంటప్పుడే పట్టణ అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ,కౌన్సిలర్ లు మ్యాకల అనురాధ,కల్లెడ సునీత,మహేష్ గౌడ్ ,మహేందర్ ,శ్రీరాముల సువర్ణ,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, జిల్లా,మండల నాయకులు కొయ్యేడి మహిపాల్ రెడ్డి,ఎద్దండి దివాకర్ రెడ్డి,రాకేష్ నాయక్,మోర రాంమూర్తి, నాగరాజు,కటకం రాజేశం,నర్సయ్య,చిట్టి,గంగారెడ్డి ,షాకీర్ ,కడకుంట్ల నరేష్ ,దిలీప్ ,రెడ్డి ,గోపాల్ ,రవి ,సతీష్ ,ప్రభాకర్ ,జనార్దన్,సాయి ,రాజు ,రాజేష్ ,శివ,బాబు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.

**సూర్య, ఓదెల**



ఓదెల మండలంలోని నాంసానిపల్లి గ్రామం నుండి కాల్వ శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు గురువారం రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు, రోడ్డు నిర్మాణం వల్ల ఇరు గ్రామాలకు ప్రజలకు, రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనారపు రేణుకాదేవి, పిఎసిఎస్ చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఓదెల మండల అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ,నారాయణరెడ్డి ,కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోప గోని సారయ్య గౌడ్, జడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి, బైరి రవి గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు , అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి..

**సూర్య, పెద్దపల్లి ప్రతినిధి**



విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దపల్లి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పెద్దపల్లి కమాన్ ప్రాంతంలో నివాసం ఉండే గదాం శ్రీనివాస్ గౌడ్ గురువారం ఇంటి పైన ఉన్న ఇనుప పైపులను బయటకు తీస్తున్న క్రమంలో పక్కనే ఉన్న 11 కెవి కరెంటు వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉచిత వైద్య పరీక్షల నిర్వహణ.

**సూర్య, ఓదెల**

సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 వ తేదీన రోజున కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య పరీక్షల శిబిరంను అబ్బిడి పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం నందు నిర్వహిస్తున్నట్లు భీష్మచారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగుతుందని ఇందులో టు డి ఈకో, ఈసీజీ ,షుగర్, బిపి పరీక్షలు దాదాపు 3000 విలువగల పరీక్షలను ఉచితంగా చేస్తారని ఈ సదవకాశాన్ని చుట్టుపక్కల గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని, ఫౌండేషన్ వారు అడగగానే అవకాశం కల్పించిన అబ్బిడి పల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఒజ్జ కొమలత శ్రీనివాస్ ,వేణు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

## సెక్రటరీ డిప్యూటేషన్ రద్దు చేయాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం పన్నూర్ గ్రామానికి డిప్యూటేషన్ పై వచ్చిన సెక్రటరీ సరిత డిప్యూటేషన్ ను రద్దు చేయాలనీ పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ కి పన్నూర్ ఎంపిటిసి-2 కొప్పుల గణపతి ఫిర్యాదు చేశారు. డిప్యూటేషన్ మీద వచ్చిన సరిత స్వగ్రామం పన్నూర్ గ్రామం అని, సొంత గ్రామానికి సెక్రటరీ గా వచ్చిన సరిత డిప్యుటేషన్ వెంటనే రద్దు చేసి యదాస్థానానికి బదిలీ చేసి నూతన సెక్రటరీ ని నియమించాలని కోరారు. లేకపోతే ఆందోళన చేపడతామని అన్నారు.

## ఘనంగా కోదండ రామాలయం, షిర్డీసాయి బాబా దేవాలయంలో 17వ సప్తదశ వార్షికోత్సవ వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం సెంటినరీ కాలనీ లోని శ్రీ కోదండ రామాలయం మరియు షిర్డీసాయి బాబా మందిరం లో ఈ నెల 12వ తేదీ నుండి గురువారం వరకు 17వ సప్తదశ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానాచార్యులు గోవర్ధనగిరి వేణు మనోహర్ చార్యులు, ఆలయ పూజారి శ్యామ్ సుందర్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం నగర సంకీర్తన మరియు అభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ బేగంపేట గ్రామ వాస్తవ్యులు గుండా సరస్వతి-సత్తయ్య వారి కుమారులు చేశారు. ఈ వేడుకలలో ఎస్పోటు జీఎం గుంజపడుగు రఘుపతి, ఆలయ కమిటీ చైర్మన్ వనం రామచంద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంట వెంకటరమణారెడ్డి, ఆలయ కార్యదర్శి ముప్పిడి రవీందర్, ఆలయ వైస్ ప్రెసిడెంట్ కాటం సత్యం, తులసీరామ్, కోశాధికారి విశ్వేశ్వర్, మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్ రావు తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ మరియు కామర్స్ పరీక్షకు మొత్తం 59 మందికి గాను 57 మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరు అయ్యారని తెలిపారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని కాపులపల్లి, కనగర్తి, పెద్దకల్వల, పెద్దబొం కూర్, కొత్తపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభించారు. ఉపాధి హామీలో పూర్తయిన సిసి రోడ్లు, పలు అభివృద్ధి పనులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం నిర్మాణం కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీల అమలు పక్కాగా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ లు గోపు కవిత శ్రీనివాస్ ,కారంగుల రమేష్ ,సిలారపు సత్యం లు, సింగిల్ విండో చైర్మన్ సంపత్, ఎంపిటిసిలు, ఎడెల్లి శంకర్ కాంగ్రెస్ నాయకులు మందల సత్యనారాయణ రెడ్డి ,నందనవేని రాజేందర్ , ఎల బోతారం శంకర్, మాజీ ఉపసర్పంచ్ అరకటి సంతోష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నేడు కమాన్పూర్ లో విద్యుత్ వినియోగదారుల సదస్సు

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్పూర్ మండలంలోని కెఎన్ ఫంక్షన్ హాల్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పరచినట్లు టిఎస్ఎన్ పి డి సి ఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్పర్సన్ ఎన్.వి.వేణుగోపాల చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధన, కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ల మార్పుడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపల ఉన్న మీటర్ల మార్పుడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడు క్రమబద్దీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకానికన్నా హెచ్చు మొత్తంలో గల బిల్లులు, క్యాటగిరి మార్పు, సర్వీసు రద్దు మొదలగు వాటికి సంబంధించిన విద్యుత్ వినియోగదారులు వ్రాతపూర్వకంగా తమ ఫిర్యాదులు అందించవచ్చునని తెలిపారు. ఈ ఫిర్యాదులు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు స్వీకరించబడునని తెలిపారు. కావున కమాన్పూర్, ముత్తారం, మంథని, బేగంపేట,ఎక్లాస్పూర్ మండలం లోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చైర్పర్సన్ ఎన్.వి.వేణుగోపాల చారి, మెంబర్లు కె.తిరుమల(టెక్నికల్), ఆర్. చరణ్ దాస్(ఫైనాన్స్), ఎన్.నరేందర్(ఇండిపెండెంట్) లు కోరారు.